

ఏయూకు ఇన్‌చార్జి వీసీ?

రెండు, మూడు వారాల్లో నియామకం

- రేస్‌లో పలువురు సీనియర్ ప్రొఫెసర్లు
- తమకు ఉన్న పరిచయాల ద్వారా పైరవీలు
- ఇప్పటికే సమాచార సేకరణలో ప్రభుత్వం

. 7లో



జలాశయాలు కళకళ

ఎగువ ప్రాంతాల నుంచి చేరుతున్న వరద నీరు

గతేడాది కంటే పెరిగిన నీటి నిల్వలు

ఆయకట్టు రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని జలాశయాలకు జలకళ సంతరించుకుంది. రెండు, మూడు రోజులుగా జిల్లాలో అడపా దడపా వర్షాలు కురుస్తున్నాయి. దీనికి తోడు జలాశయాలకు ఎగువన గల అటవీ ప్రాంతాల్లో గత కొద్ది రోజులుగా భారీగా వర్షాలు కురుస్తుండంతో జలాశయాలకు వరదనీరు చేరుతోంది. దీంతో ఈ ఏడాది పంటలకు సాగునీటి ఇబ్బందులు ఉండవని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో తాండవ జలాశయం మినహా రైవాడ, కోనాం, వరహా, పెద్దేరు జలాశయాల్లో గత రెండు మూడు రోజులుగా గతేడాది కంటే నీటిమట్టాలు పెరుగుతున్నాయి. జలాశయాలకు ఎగువ ప్రాంతాలైన గిరిజన ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా పెద్దఎత్తున వరద నీరు జలాశయాలకు చేరుతోంది. జిల్లాలో రావికమతం మండలం కల్యాణపులోవ జలాశయంలోకి వరద నీరు ఎక్కువగా చేరింది. సోమవారం గేట్లు ఎత్తి నీరు దిగువ ప్రాంతానికి వదిలారు. మంగళవారం తాండవలో 520 క్యూసెక్కులు, రైవాడలో 345 క్యూసెక్కులు, కోనాంలో 100 క్యూసెక్కులు, పెద్దేరులో 312 క్యూసెక్కులు, వరహాలో 130 క్యూసెక్కులు నీరు చేరి జలాశయాలు జలకళతో ఉట్టిపడుతున్నాయి. ఆయా జలాశయాల నీటిమట్టాల ప్రకారం తాండవ నీరు ఈ నెల 31న, రైవాడ, కోనాం, పెద్దేరు నీటిని ఆగస్టు మొదటి వారంలో ఖరీఫ్ వరి సాగుకు వదలనున్నారు. తాండవ జలాశయ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 380 అడుగులకుగాను మంగళవారం నాటికి 363.70 అడుగులుండగా, గతేడాది ఇదే రోజున 369.10 అడుగులు నీరు ఉంది. ఈ ఐదు జలాశయాల కింద 84,763 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇదే విధంగా జలాశయాల నీటిమట్టాలు పెరిగితే ఖరీఫ్ సాగుకు సాగునీటి సమస్య ఉండదని జల వనరుల శాఖ అధికారులు అంటున్నారు.



రావికమతం మండలంలో వరద నీటితో నిండు కుండలా ఉన్న కల్యాణపులోవ జలాశయం

జిల్లాలో జలాశయాల సామర్థ్యం, నీటి నిల్వల వివరాలు

జలాశయం	పూర్తి సామర్థ్యం	ప్రస్తుత నిల్వ	గతేడాది నీరు	ఆయకట్టు (ఎకరాల్లో)
తాండవ	380.00	363.10	369.10 (అడుగుల్లో)	32,689
రైవాడ	114.00	109.95	108.20 (మీటర్లలో)	15,344
కోనాం	101.25	98.20	95.25 (మీటర్లలో)	12,276
పెద్దేరు	137.00	136.25	134.90 (మీటర్లలో)	19,969
వరహా	460.00	458.50	450.00 (అడుగుల్లో)	4,485



పెద్దేరు జలాశయం మూడవ నంబరు గేటు తెరిచి నీటిని విడుదల చేసిన దృశ్యం

గత వైసీపీ పాలనలో అంతులేని నిర్లక్ష్యం

జలాశయాల ఆధునికీకరణ, పంట కాలువల మరమ్మతుల విషయంలో గత వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లగా నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా ఆయకట్టులో కాలువల మరమ్మతులు చేయకపోవడం, ముళ్లకంపలు పెరిగిపోవడం తదితర కారణాలతో జలాశయాల పరిధిలోని చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. వైసీపీ ప్రభుత్వం సాగునీటి వనరుల అభివృద్ధి, పంట కాలువల మరమ్మతులకు పైసా విదల్చకపోవడం వల్ల ఆయకట్టు రైతులు నష్టపోయారు. జల వనరుల శాఖాధికారులు మాత్రం ప్రతి ఏడాది జలాశయాల ఆధునికీకరణ, పంట కాలువల మరమ్మతు పనుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కూటమి ప్రభుత్వం సాగునీటి వనరుల అభివృద్ధిపై ఇప్పటికే దృష్టి పెట్టడంతో ఇకపై సాగునీటి కష్టాలు ఉండవని రైతులు ఆశిస్తున్నారు.

పెద్దేరు జలాశయం నీరు విడుదల

మాడుగుల రూరల్: మండలంలోని రావిపాలెం పెద్దేరు ... మిగతా 8వ పేజీలో





పురవీధుల్లో రథోత్సవం (ఇన్‌సెట్‌లో) రథంపై ఉత్సవమూర్తులు

వైభవంగా జగన్నాథుని తిరుగు రథోత్సవం

- పోటెత్తిన భక్తజనం

అనకాపల్లి టౌన్, జూలై 16: సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామి తిరుగు రథోత్సవ కార్యక్రమం మంగళవారం కన్నుల పండువగా సాగింది. తెల్లవారుజామున ఉత్సవమూర్తులకు ఆలయ అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గూడ్స్‌షెడ్డు వద్ద గల ఇంద్రద్యుమ్న హాల్‌లో నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో మంగళవారం ఉదయం ఉత్సవమూర్తులను రథారోహణ చేశారు. తిరుగు రథోత్సవాన్ని జనసేన పార్టీ నాయకుడు భీమరశెట్టి రాంకీ ప్రారంభించారు. గూడ్స్‌షెడ్డు వద్ద ప్రారంభమైన రథయాత్ర స్టేషన్‌రోడ్డు మీదుగా చిన నాలుగురోడ్ల జంక్షన్‌కు చేరుకుంది. అక్కడి నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా ఎన్టీఆర్ జంక్షన్, నెహ్రూచౌక్, శారదా వంతెన తిరిగి మెయిన్‌రోడ్డు మీదుగా చిననాలుగురోడ్ల జంక్షన్ వరకు సాగింది. అక్కడి నుంచి వన్ వే జంక్షన్ వరకు రథయాత్ర నిర్వహించారు. తిరిగి చిననాలుగురోడ్ల జంక్షన్‌కు వచ్చిన తరువాత గవరపాలేనికి చెందిన భక్తులు రథాన్ని చింతావారివీధి మీదుగా గవరపాలెంలోని పురవీధుల గుండా సాగించారు. అర్ధరాత్రి దాటిన తరువాత అగ్గిమర్రి చెట్టు వద్ద గల జగన్నాథస్వామి ఆలయానికి రథం చేరుకోవడంతో రథయాత్ర ముగిసింది.

నిత్యావసర సరకుల ధరల స్థిరీకరణకు స్టాల్స్ ఏర్పాటు

- జిల్లాలో 20 దుకాణాల్లో బియ్యం, కందిపప్పు తక్కువ ధరకు అమ్మకాలు

అనకాపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నిత్యావసర సరకుల ధరల స్థిరీకరణకు జిల్లాలో 20 స్టాల్స్‌ను ఏర్పాటు చేసినట్టు జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి కేఎస్ఎన్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎంపిక చేసిన రైతు బజార్లు, ప్రముఖ హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో కందిపప్పు, సోనామసూరి బియ్యం ధరలను తగ్గించి ప్రభుత్వం స్టాల్స్ ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. దేశవాళి కందిపప్పు కిలో రూ.160, పచ్చి సోనామసూరి బియ్యం కిలో రూ.48, స్టీమ్డ్ సోనా మసూరి కిలో బియ్యం రూ.49ల ధర నిర్ణయించి అమ్మకాలు జరుపుతున్నామని తెలిపారు. అనకాపల్లి పట్టణంలో 7, ఎలమంచిలి 2, నర్సీపట్నం 2, బుచ్చెయ్యపేట 2, చోడవరం 5, సబ్బవరం 1, కశింకోటలో ఒక స్టాల్‌ను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. వినియోగదారులు కందిపప్పు, బియ్యం సరసమైన ధరలకు ఆయా స్టాల్స్‌లో ఎన్ని కిలోలు కావాలంటే అన్ని కిలోలు పొందవచ్చునని తెలిపారు.

నేడు ఎస్పీగా దీపిక బాధ్యతల స్వీకరణ

అనకాపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి):




దీపిక

జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌గా ఎం.దీపిక బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. విజయనగరం ఎస్పీగా పని చేస్తున్న ఆమెను ఇటీవల అనకాపల్లి జిల్లాకు ప్రభుత్వం బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఇక్కడ పనిచేస్తున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణను అనంతపురం ఎస్పీగా బదిలీ చేశారు. బుధవారం ఉదయం 11.15 గంటలకు ఎస్పీగా దీపిక బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియాతో మాట్లాడనున్నారు.

బతికుండగానే చంపేశారే!

- ఓ మహిళ ఆవేదన
- వైద్యం కోసం ఆరోగ్యశ్రీకి ఆన్‌లైన్ చేస్తే చనిపోయినట్టు సమాచారం రావడంతో కంగుతిన్న వైనం



ఆరోగ్యశ్రీలో అప్‌లోడ్ చేయగా చనిపోయినట్టుగా వచ్చిన సమాచారం



సాధిరెడ్డి లక్ష్మి

నక్కపల్లి, జూలై 16: మండలంలోని రేబాక గ్రామానికి చెందిన సాధిరెడ్డి లక్ష్మి అనే మహిళ వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్లి ఆరోగ్యశ్రీకి ఆన్‌లైన్ దరఖాస్తు చేస్తే చనిపోయినట్టు సమాచారం రావడంతో ఆమె కంగుతిన్నది. తాను బతికుండగానే చంపేశారని ఆవేదన వ్యక్తం చేసింది. దీనికి సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. రేబాక గ్రామానికి చెందిన సాధిరెడ్డి లక్ష్మి చేతి వేలికి గాయమైంది. నక్కపల్లి 50 పడకల ఆస్పత్రిలో ఆర్థో సేవలు అందుబాటులో వుండడంతో, ఆమె చేతి వేళ్లకు సర్జరీ చేయాలని ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రవికిరణ్ చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యసేవలు పొందేవారికి ప్రభుత్వం కొంత నగదు సాయాన్ని కూడా రోగుల ఖాతాల్లో వేస్తుంది. ఈ మేరకు సాధిరెడ్డి లక్ష్మి ఆరోగ్యశ్రీ, ఆధార్‌కార్డులతో మంగళవారం నక్కపల్లి ఆస్పత్రికి వచ్చింది. ఇక్కడి ఆరోగ్యశ్రీ యూనిట్ సిబ్బంది ఆన్‌లైన్‌లో లక్ష్మి పేరును అప్‌లోడ్ చేశారు. ఎన్నిసార్లు అప్‌లోడ్ చేసినా ఫలితం లేకపోయింది. ఆమె చనిపోయినట్టుగా చూపించడంతో సిబ్బంది నివ్వెరపోయారు. ఈ విషయాన్ని ఆమెకు చెప్పడంతో కుటుంబసభ్యులు, పలువురు పెద్దలు కూడా మరీ ఇంత దారుణమా? అంటూ ... మిగతా 8వ పేజీలో

ఎమ్మెల్సీ టికెట్‌కు వైసీపీలో లొల్లి

స్థానిక సంస్థల కోటాలో భర్తీ చేయనున్న స్థానం కోసం నేతల మధ్య పోటీ



కోలా గురువులు



గుడివాడ అమర్‌నాథ్



ఎంవీవీ సత్యనారాయణ

(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి)

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్సీ టికెట్ కోసం లొల్లి మొదలైంది. స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన వంశీకృష్ణ శ్రీనివాస్ ఆరు నెలల కిందట పార్టీకి, పదవికి రాజీనామా చేసి జనసేనలో చేరిపోయారు. వంశీకృష్ణశ్రీనివాస్ రాజీనామాతో ఖాళీ అయిన స్థానం కోసం జిల్లాలో ఆ పార్టీ నేతలు పోటీపడుతున్నారు. ఈ వ్యవహారం అధిష్ఠానానికి తలనొప్పిగా మారింది.

- వంశీకృష్ణ శ్రీనివాస్ రాజీనామాతో ఖాళీ అయిన స్థానం
- పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులుకు గతంలో అధిష్ఠానం హామీ
- ఎన్నికల అనంతరం మారిన పరిణామాలు
- తనకు కావాలంటూ మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ డిమాండ్
- తనకు ఇవ్వాలని మాజీ ఎంపీ ఎంవీవీ పట్టు
- అభ్యర్థి ఎంపికపై అధిష్ఠానం మల్లగుల్లాలు

మూడేళ్ల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో మెజారిటీ స్థానాలను వైసీపీ గెలుచుకుంది. ఈ నేపథ్యంలో 2021 డిసెంబరులో స్థానిక సంస్థల కోటాలో రెండు ఎమ్మెల్సీ పదవులు ఖాళీ కాగా వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణిలను ఎంపిక చేశారు. అయితే వంశీకృష్ణ గత ఏడాది నవంబరులో వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు. పార్టీ ఫిరాయింపు పేరుతో వంశీకృష్ణ శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీ పదవికి అనర్హుడిగా శాసన మండలి చైర్మన్ ప్రకటించారు. ఆ స్థానంలో మరొకరిని ఎంపిక చేయాల్సి ఉంది. ఈలోగా సాధారణ ఎన్నికలు వచ్చాయి. దీంతో ఎమ్మెల్సీ ఎంపిక ప్రక్రియ పూర్తికాలేదు. త్వరలో ఎమ్మెల్సీ స్థానాన్ని భర్తీ చేయనుండడంతో వైసీపీలో ఆశావహులు బయటకు వస్తున్నారు. 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం, 2014లో వైసీపీ తరపున దక్షిణ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన కోలా గురువులుకు 2019, 2024 ఎన్నికల్లో పోటీకి పార్టీ అధిష్ఠానం అవకాశం ఇవ్వలేదు. 2023లో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ పదవులకు ఎన్నిక జరిగినప్పుడు గురువులును అధిష్ఠానం పోటీకి దింపింది. అయితే కొంతమంది ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ చేయడంతో గురువులు ఓటమి పాలయ్యారు. తర్వాత పార్టీ ఆయన్ను పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమించడంతోపాటు డీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించింది. వంశీకృష్ణ శ్రీనివాస్ రాజీనామాతో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానాన్ని పార్టీకి విధేయుడిగా ఉన్న కోలా గురువులుకు కేటాయిస్తారని పార్టీ నేతలంతా అభిప్రాయం వ్యక్తంచేసేవారు. అయితే ఇటీవల సాధారణ ఎన్నికల్లో వైసీపీ ఘోరపరాజయం తర్వాత పరిణామాలు ఒక్కసారిగా మారిపోయాయి. పార్టీ కోసం తీవ్రంగా కష్టపడడంతోపాటు ఎన్నికల్లో భారీగా డబ్బులు ఖర్చు చేసినందున తనకు ఎమ్మెల్సీ ఇవ్వాలని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అధిష్ఠానాన్ని కోరినట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. మరో ఐదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉంటూ అధికార పార్టీపై పోరాటం చేయాలంటే తనకు ఏదో ఒక చట్టబద్ధమైన పదవి అవసరమని అమర్‌నాథ్ అడిగినట్టు పేర్కొంటున్నారు. మరోవైపు గడిచిన ఎన్నికల్లో దాదాపు రూ.వంద కోట్లు వరకూ ఖర్చు పెట్టడంతో కూటమి ప్రభుత్వం తనను లక్ష్యంగా చేసుకుని కక్ష సాధింపు ప్రారంభించిందని, వాటన్నింటినీ తట్టుకుని నిలబడాలంటే చట్టబద్ధమైన పదవి ఉంటేనే తప్ప సాధ్యం కాదని మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అధిష్ఠానానికి మొరపెట్టుకున్నట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. తనకు ఆర్థికంగా ఇబ్బంది లేకపోయినప్పటికీ ఏదో రకంగా కేసుల్లో ఇరికించే అవకాశం ఉన్నందున ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని ఆయన కోరుతున్నట్టు పార్టీలో ప్రచారం జరుగుతోంది. ఇదిలావుంటే కోలా గురువులు మాత్రం తనకు అధిష్ఠానం అన్యాయం చేయదని ధీమాగా ఉన్నారు. ఇటీవల నగరానికి వచ్చిన పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి వద్ద ముగ్గురు నేతలు ఈ విషయం కదిపారు. ఎవరికి వారు తమకే ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో ఆయన తల పట్టుకున్నట్టు సమాచారం. పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డితో చర్చించి నిర్ణయం తీసుకుటామని వారికి సుబ్బారెడ్డి చెప్పినట్టు తెలిసింది.

మాజీ వలంటీర్ వీరంగం

- వైద్య శిబిరానికి వచ్చి మద్యం మత్తులో బీభత్సం
- వైద్య పరికరాలు, మందులను చెల్లాచెదురు చేసిన వైనం
- పోలీసులకు సచివాలయ సిబ్బంది ఫిర్యాదు



టేబుళ్లను మాజీ వలంటీర్ విసిరికొట్టడంతో చెల్లాచెదురైన మందులు

మాకవరపాలెం, జూలై 16: మండలంలో గిడుతూరులో ఓ మాజీ వలంటీర్ మంగళవారం వీరంగం సృష్టించాడు. 108 సిబ్బందితో కలిసి సచివాలయ సిబ్బంది వైద్య శిబిరం నిర్వహిస్తుండగా అక్కడికి వచ్చి మద్యం మత్తులో బీభత్సం చేశాడు. టేబుళ్లను తిరగేసి మందులను చెల్లాచెదురు చేశాడు. దీనిపై పోలీసులకు సచివాలయ సిబ్బంది ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. గిడుతూరులోని రామాలయం వద్ద ఉన్న భవనంలో 108 సిబ్బంది ప్రతి మంగళవారం వైద్య శిబిరం నిర్వహిస్తుంటారు. సచివాలయ సిబ్బంది అక్కడ సేవలు అందిస్తుంటారు. ఇదే క్రమంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించి రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఆ సమయంలో మూకల రమణబాబు అనే మాజీ వలంటీర్ అక్కడికి వచ్చాడు. ఇతను ఎన్నికల ముందు వలంటీర్ ఉద్యోగానికి రాజీనామా చేశాడు. కాగా మద్యం మత్తులో వైద్య శిబిరానికి రావడంతో అక్కడ ఉన్న రోగులు ముక్కు మూసుకున్నారు. దీంతో కోపోద్రిక్తుడైన మాజీ వలంటీర్ అక్కడ ఉన్న కుర్చీలు, టేబుళ్లను విసిరికొట్టాడు. దీని వల్ల అక్కడే ఉన్న ఆశ కార్యకర్త పాసపు రామరత్నానికి దెబ్బలు తగిలాయి. అంతటితో ఆగకుండా అతను రోగులకు ఇవ్వాల్సిన మందులను చెల్లాచెదురు చేశాడు. వైద్య పరికరాలను పగులగొట్టాడు. ఈ సంఘటనపై పోలీసులకు ఏఎన్ఎం సాయిరెడ్డి నాగలక్ష్మి, ఆశ కార్యకర్త పాసపు రామరత్నం ఫిర్యాదు చేశారు.

వ్యర్థ రసాయనాలతో ట్యాంకర్ పట్టివేత

- గంగవరం వద్ద సముద్రంలోకి వ్యర్థాలను విడిచిపెడుతుండగా పట్టుకున్న పీసీబీ బృందం
- పరవాడ పోలీసులకు ఈఈ ముకుందరావు ఫిర్యాదు



వ్యర్థ రసాయనాలతో పట్టుబడిన ట్యాంకర్ ఇదే

పరవాడ, జూలై 16: ఫార్మా వ్యర్థ రసాయనాలతో ఓ ట్యాంకర్ పట్టుబడింది. పెదగంట్యాడ మండలం గంగవరం బ్రిడ్జి సమీపంలోని కాలువ ద్వారా సముద్రంలోకి ఫార్మా వ్యర్థ రసాయనాలను విడిచిపెడుతుండగా సోమవారం అర్ధరాత్రి పీసీబీ బృందం రెడ్ హ్యాండెడ్‌ పట్టుకుంది. ట్యాంకర్‌ను రాంకీ సీఈటీపీకి తరలించారు. దీనిపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ముకుందరావు పరవాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి సీఐ బాల సూర్యారావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఓ ట్యాంకర్ ఫార్మా వ్యర్థ రసాయనాల లోడుతో సోమవారం రాత్రి పెదగంట్యాడ మండలం గంగవరం సముద్రం వైపు వెళ్తున్నట్టు స్థానికులు పీసీబీ అధికారులకు సమాచారమిచ్చారు. వారి సమాచారం మేరకు పీసీబీకి చెందిన ముగ్గురు సభ్యుల బృందం ట్యాంకర్‌ను వెంబడించింది. సరిగ్గా పెదగంట్యాడ మండలం గంగవరం బ్రిడ్జి వద్ద ట్యాంకర్‌ను డ్రైవర్ ఆపి గెడ్డ ద్వారా సముద్రంలోకి వ్యర్థాలను విడిచిపెడుతున్నాడు. అప్పటికే అక్కడికి చేరుకున్న పీసీబీ బృందం ట్యాంకర్ డ్రైవర్ కేవీ రామరాజును ప్రశ్నించారు. ఎక్కడ నుంచి వ్యర్థ రసాయనాలను తీసుకువచ్చావని గట్టిగా నిలదీయగా అచ్యుతాపురం సెజ్‌లోని ఓ ఫార్మా పరిశ్రమ నుంచి తీసుకువచ్చినట్టు సమాధానమిచ్చాడు. అయితే సంబంధిత పరిశ్రమ పేరు చెప్పేందుకు డ్రైవర్ నిరాకరించాడు. వెంటనే బృందం సభ్యులు డ్రైవర్‌తో సహా ట్యాంకర్‌ను ఫార్మాసిటీలోని రాంకీ కోస్టల్ ఎన్విరాన్‌మెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (సీఈటీపీ)కు తరలించారు. డ్రైవర్‌ను పరవాడ పోలీసులకు అప్పగించి పీసీబీ ఈఈ ఫిర్యాదు చేశారు. కాగా డ్రైవర్ మంగళవారం ఉదయం స్టేషన్ నుంచి వెళ్లిపోయినట్టు సమాచారం. పట్టుబడిన ట్యాంకర్ కృష్ణాజిల్లాకు చెందిన వ్యక్తిదిగా పోలీసులు గుర్తించారు. లారీ యజమాని స్టేషన్‌కు వస్తేగాని వివరాలు చెప్పలేమని పీసీబీ ఈఈ వెల్లడించారు. పట్టుబడిన వ్యర్థ రసాయనాల సామర్థ్యం సుమారు 20 వేల లీటర్లకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. కొన్ని ఫార్మా యాజమాన్యాలు గుట్టు చప్పుడు కాకుండా వ్యర్థ రసాయనాలను బహిరంగ ప్రదేశాల్లో విడిచిపెట్టడం ఇటీవల ఎక్కువైపోయింది. తాజాగా పట్టుబడిన ట్యాంకర్‌లోని వ్యర్థ రసాయనాలు ఏ పరిశ్రమకు చెందినవో పోలీసుల విచారణలో తేలనుంది. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో చోటు చేసుకోకుండా బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు సంబంధిత పరిశ్రమలు సీజ్ చేస్తామని ఈఈ ముకుందరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

పట్నం మెయిన్ రోడ్డు పనుల నాణ్యత పరిశీలన

- విశాఖపట్నం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీ
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు చర్యలు

. 7లో

క్రైం... crime news

విద్యుదాఘాతంతో రైతు మృతి

» తురకలపూడిలో విషాదం



తోకల సత్యారావు, (ఫైల్‌ఫొటో)

బుచ్చెయ్యపేట, జూలై 16: మండలంలోని తురకలపూడి గ్రామంలో మోటారు వేయగా విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. మృతుడు కుటుంబీకుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తురకలపూడి గ్రామానికి చెందిన తోకల సత్యారావు (65) మంగళవారం మధ్యాహ్నం పొలానికి నీరు పెడదామని వ్యవసాయ మోటారు స్విచ్ ఆన్ చేశాడు. బోర్డుకు విద్యుత్ సరఫరా కావడంతో సత్యారావు పెద్దగా కేకలు పెట్టి పడిపోయాడు. దీంతో సమీపంలో ఉన్న రైతులు చికిత్స నిమిత్తం స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని, అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సిఫార్సు చేయడంతో కుటుంబీకులు ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు సత్యారావు మృతి చెందినట్టు ధ్రువీకరించారు. సత్యారావు మృతి చెందడంతో భార్య సోమేశ్వరి, ఇద్దరు కుమారులు చంద్రరావు, కామేశ్వరరావు కన్నీరుమున్నీరుగా విలపించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రమాదవశాత్తూ నేల బావిలో పడి రైతు మృతి

నాతవరం, జూలై 16 : మండలంలోని ఎంబీపట్నంలో ప్రమాదవశాత్తు నేలబావిలో పడి రైతు మృతి చెందాడు. నాతవరం ఎస్‌ఐ ఎం. రామారావు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఎంబీపట్నం గ్రామానికి చెందిన రైతు ఉలబాల సత్యనారాయణ (44) మంగళవారం పొలంలో గడ్డి కోస్తూ ప్రమాదవశాత్తు నేలబావిలో పడి పోయి మృతి చెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడు సత్యనారాయణ కుమార్తె గాలి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రామారావు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించామని ఆయన తెలిపారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై దాడులు

» పోలవరం కాలువ గట్టు వద్ద ఎక్స్‌కవేటర్, రెండు లారీలు, ట్రాక్టర్ సీజ్



పోలీసు స్టేషన్‌లో సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్

కశింకోట, జూలై 16 : మండలంలోని నర్సింగబిల్లి శివారున ఉన్న పోలవరం ఎడమ కాలువ గట్టుకు ఉన్న గ్రావెల్ అక్రమ తవ్వకాలపై పోలవరం ఎడమ కాలువ డీఈ ప్రేమ్‌బాబు, తహసీల్దార్ మధుసూదన్, మైన్స్ ఆర్‌ఐ స్వాతి, ఆర్‌ఐ రమేశ్, పోలీసులు సంయుక్తంగా మంగళవారం దాడి చేశారు. ఈ దాడుల్లో ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వుతున్న ఒక ఎక్స్‌కవేటర్, ఒక ట్రాక్టర్, రెండు లారీలను సీజ్ చేసి కశింకోట పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. వీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టవద్దని కశింకోట పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసి మరీ అప్పగించామని తహసీల్దార్ మధుసూదన్ తెలిపారు. కాగా కోట్లాది రూపాయలు ప్రభుత్వం వెచ్చించి పోలవరం కాలువ నిర్మాణం చేస్తుంటే ఈ విధంగా గట్లను కొల్లగొట్టడం పట్ల ఈ ప్రాంత రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిధుల స్వాహాపై హార్టికల్చర్ అసిస్టెంట్‌కు చార్జి మెమో

రోలుగుంట, జూలై 16: మండలంలోని కె.నాయుడుపాలెం ఆర్‌బీకే కేంద్రంలో హార్టికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆర్.నరేంద్రకు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకర్ మంగళవారం చార్జి మెమో జారీచేశారు. గత ఏడాది ఖరీఫ్‌లో వరి విత్తనాల విక్రయాలకు సంబంధించి 150 మంది రైతుల నుంచి వసూలు చేసిన రూ.1.35 లక్షలు ఆర్‌బీకే ఖాతాకు జమ చేయకుండా స్వాహా చేశారు. అలాగే కె.నాయుడుపాలెంలో 20 మంది రైతులకు రాయితీపై యాంత్రీకరణ పరికరాలు తక్కువ ధరకే అందిస్తానని నమ్మబలికి రైతులను మోసం చేసిన ఘటనపై కూడా గతంలో ఆ గ్రామ రైతులు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన అధికారులు మూడు రోజుల్లో చెల్లించాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకుంటామని చార్జి మెమో జారీ చేశారు.

ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసుల సేవలు ప్రశంసనీయం

» బదిలీ అయిన ఎస్పీ మురళీకృష్ణకు సత్కారం



బదిలీ అయిన ఎస్పీ మురళీకృష్ణను సత్కరిస్తున్న దృశ్యం

తుమ్మపాల, జూలై 16: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, సారా, గంజాయి రవాణాను అరికట్టడం, తదితర అంశాల్లో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ సిబ్బంది జిల్లా పోలీసులకు వెన్నుముకగా నిలిచారని బదిలీ అయిన ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. అనకాపల్లి జిల్లా ఎస్పీగా విధులు నిర్వహించి అనంతపూర్ జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా ఎస్పీ కేవీ మురళీకృష్ణను ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ సిబ్బంది మంగళవారం విశాఖ కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ మైదానంలో ఆత్మీయ వీడ్కోలు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికలు, బందోబస్తు, భద్రతా అంశాల్లో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. అనంతరం మురళీకృష్ణను ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ సిబ్బంది దుశ్శాలువాను కప్పి పూలమాలలు వేసి జ్ఞాపికను ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్, డీఎస్పీలు ఎస్. అప్పలరాజు, కేవీ సత్యనారాయణ, డి.అప్పారావు, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, అప్పలనాయుడు, కుమారస్వామి, మన్మథరావు, సతీశ్ పాల్గొన్నారు.

తిరుమలకు పర్యాటక శాఖ ప్రత్యేక టూర్ ప్యాకేజీ

విశాఖపట్నం, జూలై 16: విశాఖ నుంచి తిరుమలకు వెళ్లే ప్రయాణికుల కోసం పర్యాటక శాఖ ప్రత్యేక టూర్ ప్యాకేజీ రూపొందించింది. ఈనెల 19వ తేదీ నుంచి ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటలకు 30 స్లీపింగ్ బెర్తులతో కూడిన ఏసీ బస్సు నగరంలో బయలుదేరనుంది. అప్పుఘర్ యాత్రి నివాస్ హోటల్ నుంచి బయలుదేరి గాజువాక, అనకాపల్లి, రాజమండ్రి, శ్రీకాళహస్తి మీదుగా తిరుపతికి చేరుకుంటుంది. 20వ తేదీ ఉదయం శ్రీకాళహస్తి హరిత హోటల్‌లో ఫ్రెషప్, అల్పాహారం, అదేరోజు తిరుమలలో స్వామివారి దర్శనం, మధ్యాహ్న భోజనం, పద్మావతి అమ్మవారి దర్శనం ఉంటాయి. సాయంత్రం బస్సు తిరుగు ప్రయాణం అవుతుంది. శ్రీకాళహస్తిలో రాత్రి భోజనం, మరుసటి రోజు ఉదయం విశాఖకు చేరడంతో పర్యటన పూర్తవుతుంది. ఈ ప్యాకేజీలో పెద్దలకు రూ.6,300, పిల్లలకు రూ.6వేలుగా టికెట్ నిర్ణయించారు. తొలి సర్వీసును కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, టూరిజం డెవలప్‌మెంట్ ఆర్‌డీ శ్రీనివాస్ పాణి ప్రారంభించనున్నారు.

తైక్వాండోలో ఆరుగురికి స్వర్ణ పతకాలు

ఎలమంచిలి, జూలై 16 : హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో టోర్నీలో ఎలమంచిలి క్రీడాకారులు 6 బంగారు పతకాలు సాధించినట్టు ఎలమంచిలి తైక్వాండో ఫౌండర్ కోచ్ నగిరెడ్డి సత్యనారాయణ తెలిపారు. ఎం.కుందన ప్రజ్ఞ, పి.సుస్మిత, దీక్షిత్ లహరి, సింహాద్రి, శ్రీవృశాగ్‌లు స్వర్ణ పతకాలు సాధించగా, ఎన్.శ్రీ ఇషిత, పోలవరపు దేవి, వుడా నందకృష్ణ, జి.విష్ణులు రజితం, బి.భవానీ కాంస్య పతకాలు సాధించారని తెలిపారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

పట్నం మెయిన్ రోడ్డు పనుల నాణ్యత పరిశీలన

» విశాఖపట్నం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీ



మెయిన్ రోడ్డు పనుల్లో నాణ్యత నిర్ధారణకు నమూనాలు సేకరిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

నర్సీపట్నం, జూలై 16: మెయిన్ రోడ్డు విస్తరణ పనుల్లో నాణ్యత నిర్ధారణకు విశాఖపట్నం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. బీటీ రోడ్డులో పలు చోట్ల నమూనాలు సేకరించారు. అబీద్ సెంటర్ నుంచి పెదబొడ్డేపల్లి మదుం వరకు రోడ్డు విస్తరణ, అభివృద్ధి, సెంటర్ డివైడర్, డ్రైనేజీ నిర్మాణ పనులకు గత వైసీపీ ప్రభుత్వం రూ.10.6 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. భూ సేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం కోసం భవన యజమానులు హైకోర్టును ఆశ్రయించడంతో మెయిన్ రోడ్డు విస్తరణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ప్రభుత్వ ఆస్తులు ఎక్కువగా ఉండడంతో ఆ ప్రాంతం వరకు రోడ్డు విస్తరణ చేసి బీటీ రోడ్డు, డ్రైనేజీ పనులు చేపట్టారు. అబీద్ సెంటర్ నుంచి పెదబొడ్డేపల్లి మదుం వరకు 1500 మీటర్లు రోడ్డు, మూడు వేల మీటర్లు డ్రైనేజీ పనులు చేపట్టాల్సి ఉండగా, కేవలం 260 మీటర్ల రోడ్డు, 250 మీటర్ల డ్రైనేజీ పనులు చేశారు. మెయిన్ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతపై పలు అనుమానాలు ఉన్నాయి. ఇసుక బదులు క్వారీ బూడిద వాడారని ఆరోపణలు ఉన్నాయి. స్పీకర్ అయ్యన్నపాత్రుడు రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతపై విచారణ చేపట్టాలని ఆర్ అండ్ బీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆర్ అండ్ బీ క్వాలిటీ కంట్రోల్ అధికారులు గత నెలలో మెయిన్ రోడ్డు తనిఖీ చేసి వెళ్లారు. ఈ నెల 12వ తేదీన అయ్యన్నపాత్రుడు మరోమారు రోడ్డు, భవనాల శాఖ అధికారులకు మెయిన్ రోడ్డు నాణ్యత తేల్చాలని ఆదేశాలు జారీ చేశారు.

రోడ్డు నాణ్యత నిర్ధారణకు నమూనాల సేకరణ

విశాఖపట్నం నుంచి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఈఈ శ్రీహరి బాబు ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం నర్సీపట్నం వచ్చి రోడ్డు పనుల్లో నాణ్యత నిర్ధారణకు నమూనాలు సేకరించారు. అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు డ్రైనేజీ, బీటీ రోడ్డు కొలతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఏఈ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లోడి గెడ్డలో ఫార్మా వ్యర్థ జలాల తొలగింపునకు శ్రీకారం

» ట్యాంకర్లతో రాంకీకి తరలింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వ్యర్థ జలాలను తోడుతున్న ట్యాంకర్ వద్ద భరిణికం గ్రామస్థులు

పరవాడ, జూలై 16: పరవాడ నుంచి అనకాపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలోని స్థానిక మల్లోడి గెడ్డలో నిల్వ ఉన్న ఫార్మా వ్యర్థ జలాల తొలగింపునకు పీసీబీ అధికారులు మంగళవారం శ్రీకారం చుట్టారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) ఈఈ పీవీ ముకుందరావు పర్యవేక్షణలో గెడ్డలో పెద్ద ఎత్తున నిల్వ ఉన్న వ్యర్థ జలాలను పైపు ద్వారా ట్యాంకర్‌లోకి ఎక్కించి రాంకీలో గల కోస్టల్ ఎన్విరాన్‌మెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(సీఈపీటీ)కు తరలిస్తున్నారు. మల్లోడి గెడ్డలో పెద్ద ఎత్తున ఫార్మా వ్యర్థ జలాలు విడిచిపెట్టడంపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'ఫార్మా యాజమాన్యాల ఇష్టారాజ్యం', 'ఫార్మా యాజమాన్యాల బరితెగింపు' శీర్షికన వరుస కథనాలు ప్రచురించిన సంగతి తెలిసిందే. గెడ్డలో నిల్వ ఉన్న వ్యర్థ జలాల కారణంగా భూగర్భ జలాలు కలుషితమవ్వడంతో పాటు అటుగా రాకపోకలు సాగించేవారంతా తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇదే విషయాన్ని కథనాల్లో ప్రస్తావించడంతో పీసీబీ అధికారులు స్పందించారు. ఫార్మాలో గల పరిశ్రమలకు నోటీసులు కూడా జారీ చేసిన సంగతి తెలిసిందే. మల్లోడి గెడ్డలో ఫార్మా వ్యర్థ జలాలు కలవడం వల్లే నీరు నల్లగా మారడంతో పాటు దుర్వాసన వెదజల్లుతున్న విషయం పీసీబీ అధికారుల పరీక్షల్లో తేలింది. దీంతో భరిణికం గ్రామస్థులు వ్యర్థ జలాలను టాంకర్లతో తరలించాలని పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు పీసీబీ అధికారులు గెడ్డలో ఉన్న వ్యర్థ జలాలను తొలగించే ప్రక్రియను ప్రారంభించారు. అయితే గెడ్డలో పూర్తిస్థాయిలో వ్యర్థ జలాలు తొలగించాలంటే నాలుగైదు ట్యాంకర్లు అవసరముందని, దీని దృష్టిలో పెట్టుకుని అదనంగా ట్యాంకర్లను ఏర్పాటు చేసి త్వరగా వ్యర్థ జలాలను తొలగించాలని మాజీ సర్పంచ్ బొండా తాతారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, వీవీ శ్రీనివాసరావు, పెద్దిశెట్టి వెంకట సత్యారావు డిమాండ్ చేశారు. గెడ్డలో వ్యర్థ జలాలను తోడుతున్న ప్రాంతాన్ని వారు పరిశీలించారు.

ఏయూకు ఇన్‌చార్జి వీసీ?

» రెండు, మూడు వారాల్లో నియామకం
» రేస్‌లో పలువురు సీనియర్ ప్రొఫెసర్లు
» తమకు ఉన్న పరిచయాల ద్వారా పైరవీలు
» ఇప్పటికే సమాచార సేకరణలో ప్రభుత్వం
» ఇన్‌చార్జిని నియమించిన తరువాత పూర్తిస్థాయి వీసీ నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం

విశాఖపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌ను నియమించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. గత నెలాఖరులో వీసీ ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ స్టీఫెన్ తమ పదవులకు రాజీనామా చేశారు. స్టీఫెన్ స్థానంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ కిశోర్‌బాబును నియమించారు. వీసీ పోస్టు మాత్రం ఖాళీగానే ఉంది. దీంతో అభివృద్ధి పనులు నిలిచిపోవడంతోపాటు కీలక నిర్ణయాలు తీసుకోవడంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయి వీసీ నియామకం ఇప్పటికిప్పుడు సాధ్యం కానందున రెండు, మూడు వారాల్లో ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌ను నియమించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు తెలిసింది.

ఏయూతోపాటు రాష్ట్రంలోని ఇతర వర్సిటీలకు ఇన్‌చార్జి వీసీలను ప్రభుత్వం నియమించనున్నది. ఇందుకోసం సమర్థులైన వారిని గుర్తించే బాధ్యతను సీఎం చంద్రబాబు నాయుడు కొందరికి అప్పగించినట్టు తెలుస్తోంది. ఈ విషయం తెలిసి ఏయూలో ఆశావహులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కొందరు తమ స్థాయిలో ప్రయత్నాలను చేస్తుండగా, మరికొందరు తమకున్న సీనియారిటీని బట్టి అవకాశం వస్తుందన్న భావనలో ఉన్నారు. ప్రస్తుతం ఏయూ ఇన్‌చార్జి వీసీ రేస్‌లో సుమారు పది మంది ఉన్నారు. వీరిలో మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావు, ఫారెన్ అఫైర్స్ డీన్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ ధనుంజయ్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శశిభూషణ్, శ్రీకాకుళం యూనివర్సిటీ వీసీగా పనిచేసి, ప్రస్తుతం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఉన్న ప్రొఫెసర్ రాంజీ, ఎగ్జామినేషన్ విభాగం డీన్‌గా చేస్తున్న ప్రొఫసర్ డీవీఆర్ మూర్తి, ఏయూ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు, గతంలో ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌గా చేసి ప్రస్తుతం కంప్యూటర్ సైన్స్ విభాగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ వల్లీ కుమారి, అదే విభాగంలో పనిచేస్తున్న మరో సీనియర్ ప్రొఫెసర్ శశితోపాటు ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీగా పదవీ విరమణ పొందిన మరో సీనియర్ ప్రొఫెసర్ పేరు వినిపిస్తోంది. వీరిలో ఒక సీనియర్ ప్రొఫెసర్ రాజకీయంగా తనకున్న పలుకుబడిని వినియోగిస్తున్నట్టు తెలిసింది. స్పీకర్‌తోపాటు పొరుగు జిల్లాకు చెందిన సీనియర్ మంత్రి ద్వారా ప్రయత్నాలను సాగిస్తున్నట్టు తెలిసింది. అయితే, ఆయన గత వీసీ ప్రసాదరెడ్డి కోటరీకి చెందిన వ్యక్తి అన్న ప్రచారం సాగుతోంది. ఈ విషయాన్ని కొందరు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్టు చెబుతున్నారు. అలాగే, నగరానికి చెందిన ఇద్దరు కీలక నేతలు ద్వారా మరో సీనియర్ ప్రొఫెసర్ తన ప్రయత్నాన్ని చేసుకుంటున్నట్టు చెబుతున్నారు. గతంలో శ్రీకాకుళం యూనివర్సిటీకి వీసీగా చేసిన మరో ప్రొఫెసర్ తనకు బంధువైన అధికార పార్టీ ఎమ్మెల్యే ద్వారా తన ప్రయత్నాన్ని గట్టిగానే చేస్తున్నారు. పరిశోధనలు, సీనియారిటీ, ఇంటర్నేషనల్ ప్రాజెక్టు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని తనకు అవకాశం కల్పిస్తారన్న భావనలో మరో సీనియర్ ప్రొఫెసర్ ఉండగా, వర్సిటీలో ప్రస్తుతం నెలకొన్న సమస్యలను తానైతే పరిష్కరించగలనన్న భావన ప్రభుత్వ పెద్దల్లో ఉందని, తనకు అవకాశం దక్కుతుందని మరో ప్రొఫెసర్ చెబుతున్నారు. ప్రభుత్వం సదరు సీనియర్ ప్రొఫెసర్ పేరు పరిశీలిస్తున్నట్టు తెలిసింది. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌గా పనిచేసిన అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుంటారన్న భావనను మరో సీనియర్ ప్రొఫెసర్ వ్యక్తం చేస్తున్నారు. వీరితోపాటు బయట నుంచి మరో ఇద్దరు తీవ్రస్థాయిలో ప్రయత్నాలను సాగిస్తున్నారు. ప్రభుత్వం ఎవరికి అవకాశం కల్పిస్తుందో చూడాలి.

గవర్నర్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడమే తరువాయి

వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమితులైన వీసీలంతా గవర్నర్‌కు తమ రాజీనామాలు చేశారు. రాజీనామాలపై గవర్నర్ న్యాయ సలహాను కోరడం వల్లే కొత్త వీసీల నియామక ప్రక్రియలో జాప్యం జరుగుతున్నట్టు చెబుతున్నారు. గవర్నర్ నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చిన వెంటనే అప్పటికే సిద్ధం చేసిన జాబితాల్లో ఒకరిని ఇన్‌చార్జి వీసీగా నియమించే అవకాశాలు ఉన్నాయి. ఆ తరువాత పూర్తిస్థాయి వీసీ నియామక ప్రక్రియను చేపట్టనున్నారు. ఇందుకు కనీసం ఆరు నెలల నుంచి ఏడాది సమయం పట్టే అవకాశం ఉంది. నోటిఫికేషన్ ఇవ్వడంతోపాటు దరఖాస్తుల స్వీకరణ, సెర్చ్ కమిటీ నియామకం, ఇతర ప్రక్రియను పూర్తిచేసి పూర్తిస్థాయి వీసీలను నియమించనున్నారు.

విద్యార్థుల మారకద్రవ్యాల వినియోగంపై విచారణ

జి.మాడుగుల, జూలై 16: ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలుర వసతి గృహంలో విద్యార్థులు మారకద్రవ్యాలు వినియోగించారన్న అంశంపై డిప్యూటీ కలెక్టర్ శర్మ మంగళవారం విచారించారు. పోలీసు, రెవెన్యూ కళాశాల సిబ్బందితో వసతిగృహంలో తనిఖీలు చేపట్టగా, అక్కడ పరిస్థితుల ఆధారంగా విద్యార్థులు మత్తు పదార్థాలు వినియోగించినట్టు నిర్ధారించారు. అంతేకాకుండా కళాశాల వసతి గృహంలో అపరిచిత వ్యక్తులు ప్రవేశించినట్టు గుర్తించారు. విద్యార్థులు వ్యసనాలకు, అపరిచిత వ్యక్తులను నిలువరించడంలో విఫలమైన వార్డెన్‌పై విచారణాధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై వ్యసనాలకు దూరంగా ఉండి చదువుకోవాలని సూచించారు. అంతకుముందు రెవెన్యూ, పోలీసులతో విడివిడిగా మాట్లాడి వివరాలు సేకరించారు. గంజాయి వంటి మారకద్రవ్యాలు వసతి గృహంలోకి వచ్చే మార్గాలను అన్వేసించాలని ఎస్‌ఐ శ్రీనివాసరావును ఆదేశించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని డిప్యూటీ కలెక్టర్ తెలిపారు. విచారణలో తహసీల్దార్ నర్సమ్మ, ఏటీడబ్ల్యూవో తిరుపాల్, ప్రిన్సిపాల్ గౌరీశంకర్, ఆర్‌ఐ కామేశ్వరరావు, కార్యదర్శి రవిశాస్త్రి, సర్పంచ్ రాంబాబు పాల్గొన్నారు.

రైళ్లు మళ్లింపు, రీ షెడ్యూల్

విశాఖపట్నం, జూలై 16: విజయవాడ డివిజన్ పరిధిలో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో పలు రైళ్లను మళ్లింపు మార్గంలో నడిపించనుండగా, మరికొన్ని రైళ్లను ఒరిజినేటింగ్ స్టేషన్ల నుంచి ఆలస్యంగా బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేసినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు.

మళ్లింపు మార్గంలో..

ఈనెల 22, 29న ఎర్నాకులం-హౌరా అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ (22878) వయా రేణుగుంట, ఎర్రగుంట్ల, నంద్యాల, గుంటూరు, కృష్ణా కెనాల్ మీదుగా, సంత్రాగచ్చి-తంబరం అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ (22841) వయా కృష్ణా కెనాల్, గుంటూరు, నంద్యాల, ఎర్రగుంట్ల, రేణుగుంట, చెన్నై ఎగ్మోర్ మీ దుగా, ఈనెల 22న హౌరా-బెంగళూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22863) వయా కృష్ణా కెనాల్, గుంటూరు, నంద్యాల, ఎర్రగుంట్ల, రేణుగుంట మీదుగా నడుస్తాయి.

రీ షెడ్యూల్..

ఈనెల 21న మల్దా టౌన్-బెంగళూరు అమృత భారత్ ఎక్స్‌ప్రెస్ (13434), ఈనెల 21, 26న హౌరా-మైసూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (228 17), ఈనెల 18, 21, 25న హౌరా-తిరుచిరాపల్లి ఎక్స్‌ప్రెస్ (12663), ఈ నెల 22, 29న హౌరా-కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ (12665), ఈ నెల 26న సిలిఘాట్ టౌన్-తంబరం ఎక్స్‌ప్రెస్ (15630), ఈనెల 22న న్యూటిన్సుకియా- తంబరం ఎక్స్‌ప్రెస్ (15930), ఈనెల 23, 26తేదీల్లో సంత్రాగచ్చి- చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ (22807) రైళ్లు ఒరిజినేటింగ్ స్టేషన్ల నుంచి గంటన్నర ఆలస్యంగా బయలుదేరుతాయి.

పలు రైళ్ల గమ్యాల కుదింపు

తంబరం స్టేషన్‌లో నిర్మాణ పనులు చేపట్టనున్నందున పలు రైళ్ల గమ్యాలను కుదించినట్టు సీనియర్ డీసీఎం తెలిపారు. దీంతో జిసిదిహ్- తంబరం ఎక్స్‌ప్రెస్ (12376) 27న చెన్నై ఎగ్మోర్ వరకు, సంత్రాగచ్చి- తంబరం అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ (22841) ఈనెల 22, 29న చెన్నై బీచ్ వరకు, సిలిఘాట్ టౌన్- తంబరం ఎక్స్‌ప్రెస్ (15630) చెన్నై సెంట్రల్ వరకు, న్యూ టిన్సుకియా-తంబరం సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (15930) ఈనెల 22, 29న చెన్నై ఎగ్మోర్ వరకు నడుస్తుంది. పైన పేర్కొన్న రైళ్లు తంబరం స్టేషన్ చేరవని ఆయన స్పష్టం చేశారు. అలాగే తిరుగు ప్రయాణంలోని తంబరం- జిసిదిహ్ ఎక్స్‌ప్రెస్ (12375) ఈనెల 27న చెన్నై ఎగ్మోర్ నుంచి, తంబరం- సంత్రాగచ్చి అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ (22842) ఈనెల 24, 31న చెన్నై ఎగ్మోర్ నుంచి, తంబరం- సిలిఘాట్ టౌన్ ఎక్స్‌ప్రెస్ (15629) ఈనెల 29న చెన్నై ఎగ్మోర్ నుంచి, తంబరం-న్యూ టిన్సుకియా ఎక్స్‌ప్రెస్ (15929) ఈనెల 25న చెన్నై ఎగ్మోర్ నుంచి బయలుదేరుతాయని పేర్కొన్నారు.

దువ్వాడ మీదుగా తిరునెల్వేలి, షాలిమార్ మధ్య ప్రత్యేక రైలు

ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వయా దువ్వాడ మీదుగా తిరునెల్వేలి, షాలిమార్ మధ్య ప్రత్యేక రైళ్ల సర్వీసులను ప్రవేశపెడుతున్నట్టు ఆయన తెలిపారు. 06087 నంబరు గల రైలు ఈనెల 18, 25న (ప్రతి గురువారం) తెల్లవారుజాము 1.50 గంటలకు తిరునెల్వేలిలో బయలుదేరి మర్నాడు ఉదయం 4.57 గంటలకు దువ్వాడ, రాత్రి 9.00 గంటలకు షాలిమార్ చేరుతుంది. తిరిగి ఈనెల 20, 27న (ప్రతి శనివారం) సాయంత్రం 5.10 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 7.52 గంటలకు దువ్వాడ, సోమవారం మధ్యాహ్నం 1.15 గంటలకు తిరునెల్వేలి చేరుతుంది.

కల్కి అవతారంలో జగన్నాథుడు



కల్కి అవతారంలో జగన్నాథస్వామి

అనకాపల్లి టౌన్, జూలై 16: స్థానిక గూడ్స్‌షెడ్డు వద్ద గల ఇంద్రజ్యుమ్న హాల్‌లో కొలువై ఉన్న సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామి మంగళవారం భక్తులకు కల్కి అవతారంలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చైర్మన్ దాడి బుజ్జి, ఈవో రాజసులోచన, కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు. కాగా సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామికి ఓ భక్తుడు వెండి కిరీటాలను బహూకరించారు. వాటిని ఉత్సవమూర్తులకు ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ అలంకరించారు.

వేంకటేశ్వరునిగా...



వేంకటేశ్వరస్వామి అలంకరణలో జగన్నాథుడు

చోడవరం, జూలై 16: జగన్నాథ రథోత్సవాల సందర్భంగా దశ రూప మహోత్సవాలలో భాగంగా మంగళవారం జగన్నాథస్వామి వేంకటేశ్వరస్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు సుదర్శన సీతారామాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాణిబాబు, ఉప్పల బాబు, ఉపాధ్యాయుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

తొలి ఏకాదశికి వెంకన్న ఆలయం ముస్తాబు



తొలి ఏకాదశి పూజలకు ముస్తాబైన స్వామివారి ఉత్సవమూర్తులు

నక్కపల్లి, జూలై 16: మండలంలోని ఉపమాక వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో బుధవారం నిర్వహించనున్న తొలి ఏకాదశి పూజలకు అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం స్వామివారి ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు తిరుమంజనసేవలు చేశారు. ఆలయంలో పెండాల్స్ ఏర్పాటు చేశారు. కొండపై వున్న స్వామివారి నిజరూపానికి బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు పంచామృతాభిషేకం చేసిన అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతిస్తామని ఆలయ అర్చకులు చెప్పారు.

శాకాంబరిగా దుర్గాదేవి



ఆషాఢ మాసం సందర్భంగా నర్సీపట్నంలోని శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో శాకాంబరి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆకు కూరలు, పండ్లతో దుర్గాదేవిని అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో శాకాంబరి అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. - నర్సీపట్నం

19న ప్రభుత్వ ఐటీఐలో మెగా జాబ్‌మేళా

పాయకరావుపేట, జూలై 16: స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ)లో ఈ నెల 19వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ప్రముఖ కార్పొరేట్ సంస్థలు జేవై.సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, టీసీఎస్(హైదరాబాద్), టెక్ మహేంద్ర(చెన్నై), క్యూసిన్ టెక్నాలజీస్(హైదరాబాద్), హాబెల్ బెల్లోస్(దువ్వాడ), ఆర్‌హెచ్‌ఐ.మాగ్నెసిటా(పరవాడ), సాయి మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్, గుడివాడ, ఎస్‌ఎస్.ముని స్పీడోమీటర్ మాన్యుఫ్యాక్చరింగ్(శ్రీసిటీ), హెటిరో ల్యాబ్స్(నక్కపల్లి), వరుణ్ మోటార్స్(విశాఖపట్నం), లక్ష్మి మోటార్స్(విశాఖపట్నం), కియా మోటార్స్(విశాఖపట్నం) తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొని తమ సంస్థల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నారన్నారు. ఐటీఐ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇనుస్ట్రుమెంట్ మెకానిక్, వెల్డర్, కోప, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ట్రేడుల్లో పాసైనవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

AJC CLASSIFIEDS

WANTED

★ ప్రముఖ సెక్యూరిటీ సంస్థ వైజాగ్ కొరకు అనుభవం కలిగిన ఫీల్డ్ ఆఫీసర్లు కావలెను. జీతం: 20,000/- సంప్ర: 9492173888 AJH-14305

FINANCE

రిటైర్డ్ పెన్షనర్స్ బుక్‌లపైన, Govt. ఉద్యోగస్తులకు పేస్లిప్‌పైన సులభవాయిదా పద్ధతిలో ఫైనాన్స్ మరియు అన్ని తరగతుల వారికి డాక్యుమెంట్స్‌పైన తనఖా Pvt ఫైనాన్స్ 10లక్షలు లోపు ఇవ్వబడును. సిబిల్ చూడబడదు సెల్: 9666547338 AJD_186720

CHANGE OF NAME

★ I, MAQUANA NIRMAL S/o. Champalal Maquana, (Old Name), R/of D.No.30-11-7, Lakshmi Street, Daba gardens, Visakhapatnam District-530020, Andhra Pradesh, India. I have changed my name to MAQUANA NIRMAL RAJPUROHIT, (New Name) AJH-53793

CHANGE OF NAME

★ I, VARSHA MAQUANA D/o. Champalal Maquana, (Old Name), R/of D.No.30-11-7, Lakshmi Street, Daba gardens, Visakha patnam District-530020,Andhra Pradesh, India. I have changed my name to VARSHA RAJPUROHIT, (New Name) AJH-53795

PLOT FOR SALE

» VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. బందరు రోడ్డు, గన్నవరం, నున్న కంచికచర్ల శ్రీ గంధం, ఎర్రచందనం మొక్కలతో చ.గ 1,900/- నుండి 18,500/- ఇళ్ళ ప్లాట్స్. ఫామ్ హౌస్ ప్లాట్ సెంట్ 1,90,000/- సంప్ర : 63028 55524. AJB_41

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176, 9966165093

పరిశుభ్రతతోనే వ్యాధుల నియంత్రణ

» వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు


అచ్యుతాపురంలో మానవహారం


కశింకోటలో అవగాహన ర్యాలీ

అచ్యుతాపురం, జూలై 16 : డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంలో పారిశు ధ్య నిర్వహణపై అవగాహన కలిగిస్తూ అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మంగళవారం ర్యాలీ, మానవహారంగా నిర్వహించారు. అపరిశుభ్రత, నీరు నిలిచిపోవ డం వల్ల దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా వంటి వ్యాధులు వ్యాపిస్తున్నాయన్నారు. పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వల లేకుండా చూడాలన్నారు. వారంలో ఒక రోజు ఇంట్లో డ్రైడే పాటించాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ శ్రావ్య, సీహెచ్‌వో వేణుగోపాల్, హెచ్ఎస్ సన్యాసిరావుతో పాటు వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

పరవాడలో..

పరవాడ : వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జీవీఎంసీ 79వ వార్డు దేశపాత్రునిపాలెం సచివాలయం శానిటరీ సెక్రటరీ గంగునాయుడు సూచించారు. వార్డు పరిధి జాజులవానిపాలెంలో మంగళవారం గ్రామస్థులకు దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత, నీటి నిల్వలు లేకుండా చేయడం వల్ల దోమల వ్యాప్తి అరికట్టవచ్చన్నారు. జ్వర లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా విభాగం వర్కర్స్ పీవీఎస్ మూర్తి, రమణ, శ్యామలాదేవి, శివపాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన ర్యాలీ..

కశింకోట : డయేరియా పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి తిరుపతిరావు సూచించారు. ఈ సందర్భంగా కశింకోట పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాచి వడబోసిన నీటిని మాత్రమే తాగాలన్నారు. పరిసరాలలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. బహిరంగప్రదేశాల్లో మలవిసర్జన చేయకుండా ఉండాలని, కలుషిత ఆహార పదార్థాలను తినవద్దని తెలిపారు. ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణ రావు, సత్యవతి, విజయలక్ష్మి, పారా మెడికల్ సిబ్బంది, ఆశలు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

H.R. DORA, Advocate
D.No.9-2-11/4, MIG-3/4, Pithapuram Colony, Visakhapatnam-530003.Cell: 94401 15189

పట్టాదారు పుస్తకాలు అందించండి

» రాజవరం రైతుల డిమాండ్


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సూర్యనారాయణ

పాయకరావుపేట రూరల్, జూలై 16 : సాగుదారులకు పట్టాదారు పుస్తకాలు మంజూరు చేయాలని రాజవరం గ్రామానికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. మండలంలోని రాజవరం గ్రామ రెవెన్యూలోనిసర్వేనెంబరు 146లో గ్రామానికి చెందిన రైతులు తమ సాగులో ఉన్న భూమికి పట్టాదారు పుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ స్పందనలో ఫిర్యాదు చేయడంతో జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు మంగళవారం తహశీల్దారు సూర్యనారాయణ మంగళవారం గ్రామాన్ని సందర్శించి రైతులతో చర్చలు జరిపారు. రాజవరం గ్రామానికి చెందిన సుమారు 32 మంది రైతులు రాజవరం రెవెన్యూలోని సర్వే నెంబరు 146లో సుమారు 42 ఎకరాలు భూమిని సాగు చేసుకుంటున్నామని రైతులు తెలిపారు. అయితే సాగుదారులుగా 1987 నుంచి 2023 వరకు తమ పేర్లు ఆన్‌లైన్‌లో ఉన్నాయని, ఇపుడు తమ పేర్లను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు వెంటనే పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని రైతులు కోరారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి నివేదికను జేసీకి అందించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డీటీ అప్పారావు,ఆర్ఐ త్రినాథ్ పాల్గొన్నారు.

వరినారు సాగుపై అవగాహన సదస్సులు


వరి నారును పరిశీలిస్తున్న ఏడీఏ ప్రభాకర్, ఏవో సౌజన్య


రాంబిల్లి : అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎస్.రాయవరం, జూలై 16 : వరి రైతులందరూ ఆరోగ్యవంతమైన నారు పెంచడంలో తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) బి.ప్రభాకర్ తెలిపారు. మండలంలోని గెడ్డపాలెం, వాకపాడు గ్రామాల్లో ఏడీఏ ప్రభాకర్, ఏవో సౌజన్యలు రైతులు సిద్ధం చేసిన నారు మడులు, యంత్రసేవ పథకం పేరుతో రైతు గ్రూపులకు సరఫరా చేసిన పనిముట్ల పని తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి దేముడు, సిబ్బంది పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

రాంబిల్లి : వాతావరణ పరిస్థితులను అనుసరించి సాగు విధానం, సమగ్ర ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయంపై దిమిలి, మురకాడ గ్రామాల్లోని రైతాంగానికి అవగాహన కల్పించారు. మంగళవారం 'ఆత్మ' ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ, జిల్లా వనరుల కేంద్రం అధికారులు కలిసి సదస్సు నిర్వహించారు. స్థానిక వ్యవసాయాధికారి సుమంత, జిల్లా వనరుల కేంద్రం ఏవో విజయ నారుమడులు పరిశీలించారు. స్థానిక వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధిపై సమీక్ష

నక్కపల్లి, జూలై 16 : మండలంలోని పలు పంచాయతీల కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఎంపీడీవో శ్రీనివాస్ మంగళవారం నక్కపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. రోజువారీ శానిటేషన్, ఈ సర్వీసెస్ పెండింగ్ అమౌంట్, పెన్షన్ల పంపిణీ, ఉపాధి హామీ పథకం పనులు, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై చర్చించారు. ఈ సమవేశంలో ఏవో సీతారామరాజు, ఈవోఆర్‌డీ బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ జీవో, గెజిట్ నిలుపుదలపై హర్షం

ఎస్.రాయవరం, జూలై 16 : ఉద్యోగ, ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేసిన జీపీఎస్ జీవో, గెజిట్‌ను నిలిపి వేయడంపై ఏపీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు కేకేఎల్ఎన్ ధర్మారావు, ప్రధాన కార్యదర్శి ఎస్. దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వాటిని శాశ్వతంగా రద్దు చేయాలని, అలాగే లక్షలాది ఉద్యోగులను మానసికంగా క్షోభకు గురిచేస్తున్న సీపీఎస్ విధానాన్ని కూడా రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని వారు కోరారు.

నాన్నబాబు సంస్మరణ సభ నేడు



అచ్యుతాపురం, జూలై 16 : తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రామన్నపాలెం సర్పంచ్ ధర్మిరెడ్డి నాయుడు బాబు (డ్రీమ్స్ నాయుడు) తండ్రి ధర్మిరెడ్డి నాన్నబాబు సంస్మరణ సభను బుధవారం రామన్నపాలెంలో నిర్వహించనున్నారు. నాన్నబాబు ఈనెల 7న పొలం పనులకు వెళ్లి అకస్మాత్తుగా మరణించారు. ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు భారీగా విచ్చేయనున్నట్టు డ్రీమ్స్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా రామన్నపాలెంలో డ్రీమ్స్‌నాయుడు ఇంటివద్ద భారీ ఏర్పాట్లు చేశారు.



పాయకరావుపేట, జూలై 16 : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రవిశంకర్‌నాయక్ అన్నారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో పాయకరావుపేట శ్రీసత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో చేపట్టిన 'శ్రీసత్యసాయి సేవా తరు' కార్యక్రమంలో భాగంగా కళాశాల చుట్టూ సుమారు 500 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా రవిశంకర్ నాయక్ మాట్లాడుతూ భావితరాలకు స్వచ్ఛమైన గాలి, పచ్చని వాతావరణం అందించేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గూటూరు శ్రీనివాసరావు, శ్రీసత్యసాయి సేవా సమితి అధ్యక్షులు కె.అప్పలనాయుడు, శివ, నక్కపల్లి డీఎస్‌వో విసినిరి రాజు, పలువురు అధ్యాపకులు, సత్యసాయి సేవా సమితి సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి


మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, సత్యసాయి సేవా ప్రతినిధులు

శాకాంబరీదేవిగా నూకాలమ్మ తల్లి



పాయకరావుపేట, జూలై 16 : ఆషాఢమాసం పురస్కరించుకుని పాయకరావుపేట పట్టణంలోని మంగవరం రోడ్డులో ఉన్న నూకాలమ్మ అమ్మవారిని మంగళవారం శాకాంబరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ఘనంగా పరమటమ్మతల్లి పండుగ


అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్

కొత్తూరు, జూలై 16 : అనకాపల్లి మండలం కూండ్రం గ్రామంలో పరమటమ్మ తల్లి పండుగ మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

కాలువ నిర్మాణానికి చర్యలు



పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సరోజిని

అచ్యుతాపురం, జూలై 16 : వెదురువాడ అపార్టుమెంట్ల నుంచి వచ్చే మురుగు నీరు పోయేలా అధికారులు ఎట్టకేలకు చర్యలు చేపట్టారు. ఈ అపార్టుమెంట్లులో నివసిస్తున్న వారు వినియోగించిన నీరు కాలువ సదుపాయం లేకపోవటంతో రోడ్లపై ప్రవహిస్తోంది. ఇది స్థానికంగా ఇబ్బందిగా తయారైంది. ఈ నేపథ్యంలో 'మురుగు కదలదు.....దుర్వాసన వదలదు' శీర్షికన ఈ నెల 14న 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చింది. దీనికి స్పందించిన తహసీల్దార్ సరోజిని వెంటనే డ్రైనేజీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అచ్యుతాపురం-గాజువాక ప్రధాన రహదారిలో గల వ్యాపారస్తులతో మాట్లాడారు. కాలువ తవ్వేందుకు ఎవరూ అభ్యంతరం చెప్పకుండా చర్యలు తీసుకున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి పనులు ప్రారంభించి అపార్టుమెంట్ల నుంచి వచ్చిన మురుగునీరు ఇందిరమ్మ కాలనీలో ఉన్న ప్రధాన కాలువకు అనుసంధానం చేసేలా కాలువ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కుమార్, వీఆర్వో శశి వెంట ఉన్నారు.



'ఉపాధి' అవకతవకలపై విచారణ

మేట్ బాధ్యతల నుంచి నాగమణి తొలగింపు


విచారణ చేపడుతున్న మణికుమార్

కొత్తూరు, జూలై 16 : ఉపాధి హామీ పనుల్లో అవకతవకలపై మేజర్ పంచాయతీ కొత్తూరులో మంగళవారం ఏపీడీ మణికుమార్ విచారణ చేపట్టారు. సోమవారం పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన గ్రామ సభలో పంచాయతీ సర్పంచ్ లక్ష్మీప్రసన్న, వార్డు సభ్యులు, కూటమి నేతలు ఎన్ఆర్ఈజీఎస్ పనుల్లో అవకతవకలు జరిగాయని ఏపీవో సుప్రియను నిలదీసిన సంగతి తెలిసిందే. ఈ విషయమై డ్వామా సహాయ పథక సంచాలకులు మణికుమార్ విచారణ జరిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో మేట్ నాగమణిపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టామన్నారు. మేట్ నాగమణికి హెచ్చరికలు జారీ చేస్తూ ఆమెను మేట్ విధులకు దూరంగా ఉంచాలని సూచించినట్లు తెలిపారు. తక్షణమే ఫీల్డ్ అసిస్టెంట్ భర్తీకి గ్రామ పంచాయతీ సహకారంతో నియమ నిబంధనలకు అనుగుణంగా అర్జీ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో కె.ధర్మారావు, ఏపీవో సుప్రియ, టెక్నికల్ అసిస్టెంట్ నాగమణి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

8 మందికి ఉచితంగా శస్త్రచికిత్సలు

అనకాపల్లి టౌన్, జూలై 16 : స్థానిక ఏఎంఏఎల్ రోటరీ నేత్ర వైద్యశాలలో మంగళవారం ఎనిమిది మంది పేదలకు ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించారు. సోమవారం ఆస్పత్రికి 45 మంది కంటి రోగులు రాగా, వారికి నేత్ర వైద్య సహాయకులు పి.దేవి వైద్యపరీక్షలు నిర్వహించి ఎనిమిది మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. దీంట్లో భాగంగా మంగళవారం ఆస్పత్రిలో డాక్టర్ కె. మల్లేశ్వరరావు ఎనిమిది మందికి ఉచితంగా ఐఓఎల్ కంటి ఆపరేషన్లు నిర్వహించారు. ఆపరేషన్లు చేయించుకున్న వారికి ఐదు రోజులకు సరిపడా మందులను ఉచితంగా అందించామని రోటరీ కంటి ఆస్పత్రి చైర్మన్ రవిరాం జవహర్ తెలిపారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు


కుక్కలను పట్టుకొంటున్న సిబ్బంది

పరవాడ, జూలై 16 : పంచాయతీ అధికారులు వీధి కుక్కల ఇబ్బందుల నుంచి ప్రజలను రక్షించే ప్రయత్నం చేశారు. దశల వారీగా కుక్కలను పట్టుకుని జీవీఎంసీకి తరలించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మండలంలో ఈ.బోనంగి పంచాయతీలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నలుగురు సిబ్బంది గ్రామంలో తిరుగుతూ వలల సాయంతో కుక్కలను పట్టుకుంటున్నారు. అనంతరం వాటిని వ్యాన్‌లో బంధించి జీవీఎంసీకి తరలిస్తున్నారు. అక్కడ కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయనున్నారని పంచాయతీ విస్తరణాధికారి కోరాడ రమేష్‌నాయుడు తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి ఆదేశాల మేరకు వీధి కుక్కల పట్టివేత కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు ఆయన వెల్లడించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ దశల వారీగా కుక్కల పట్టివేత కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్వారీల్లో భద్రతా చర్యలు చేపట్టాలి

» సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు

అనకాపల్లి టౌన్, జూలై 16 : రాష్ట్రంలోని క్వారీల్లో భద్రతా చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచెర్ల మండలం పరిటాల సమీపంలో జరిగిన క్వారీ ప్రమాదంలో ముగ్గురు వలస కార్మికులు మృతి చెందడం బాధాకరమన్నారు. క్వారీ యాజమాన్యాలు నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. బ్లాస్టింగ్ అయిన తరువాత బండరాళ్లు వదులవుతాయని వాటిని పరిశీలించకుండా కార్మికులతో పని చేయించడం వల్ల ఈ ప్రమాదం జరిగిందన్నారు. కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని, యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

నాయీ బ్రాహ్మణులకు రాయితీతో రుణాలు అందించాలి

ఎలమంచిలి, జూలై 16 : నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కార్పొరేషన్ కాకుండా ఫెడరేషన్ రాయితీతో కూడిన రుణాలు అందజేసి ఆర్థికంగా ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను జిల్లా నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కందికుప్పు గోవిందరావు ఒక ప్రకటనలో కోరారు. నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్‌ను గత ప్రభుత్వం చేసి కార్పొరేషన్‌గా చేసిందన్నారు. నాయీ బ్రహ్మణులకు ఆశించిన స్థాయిలో రుణాలు అందలేదన్నారు. సెలూన్లకు ఇచ్చే విద్యుత్ యూనిట్స్ 150 కాకుండా అర్హత ఉన్న ప్రతి దుకాణదారునికి 200 యూనిట్లు ఇవ్వాలని, వెల్ఫేర్ కమిటీలు నియమించాలని కోరారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కోటవురట్ల, జూలై 16 : కడప జిల్లా ఒంటిమిట్ల మండలం పెన్నపేరూరు గ్రామానికి చెందిన కదిరి ప్రభాకర్ అనే దళితుడిపై హత్యాయత్నానికి పాల్పడిన వెంకట సుబ్బారెడ్డి అనే వ్యక్తిపై వెంటనే ఎస్సీఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు ,చేసి అరెస్టుచేయాలని జై భారత్ ఎస్సీ పోరాట వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఖదిజ్ఞాసి త్రిమూర్తులు డిమాండ్ చేశారు. ఇలా దాడులకు అమానుషం అన్నారు. బాధితుడికి మెరుగైన చికిత్స అందించాలన్నారు. దళితులపై దాడులు చేయడం పరిపాటిగా మారిందని, నిందితులను కఠినంగా శిక్షించకపోవడం వల్లే ఇలా జరుగుతోందిన త్రిమూర్తుల ఆరోపించారు.



బతికుండగానే చంపేశారే!

... 5వ పేజీ తరువాయి

మండిపడ్డారు. అయితే నక్కపల్లి ఆస్పత్రి వైద్యసిబ్బంది ఆరోగ్యశ్రీ ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లారు. బుధవారం మొహరం సెలవు వున్నందున గురువారం ఈ సమస్యను పరిష్కరిస్తామని వారు చెప్పారు. గతంలో ఇంటింటా కుటుంబ సభ్యుల వివరాలను సేకరించేందుకు సర్వే చేసే ప్రక్రియలో ఈ పొరపాటు జరిగిందా?, లేక ఇతర కారణాల వల్ల జరిగిందా ? అనేది తెలియాల్సి వుంది. ఈ విషయమై ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రవికిరణ్‌ను సంప్రతించగా సాధిరెడ్డి లక్ష్మి అనే మహిళ చేతివేలికి గాయమైనందున చిన్న ఆపరేషన్ చేయాల్సి వుందన్నారు.

జలాశయాలు కళకళ

... 5వ పేజీ తరువాయి

జలాశయం నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరువ అవుతున్నందున జలాశయం అధికారులు అప్రమత్తమయ్యారు. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా మంగళవారం ఉదయం 250 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో నీటిమట్టం 136.50 మీటర్లకు చేరింది. ఇన్‌ఫ్లో వస్తున్నందున జలాశయం మూడో నంబరు గేటు తెరిచి 312 క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెట్టారు. మంగళవారం సాయంత్రానికి నీటిమట్టం 60 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 136.30 మీటర్లకు చేరిందని, జలాశయం పరిస్థితిని బట్టి నీటిమట్టాన్ని క్రమబద్ధీకరిస్తున్నామని ఏఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఇన్‌ఫ్లో పెరిగితే పరిస్థితిని బట్టి నీటిని విడిచిపెడతామని చెప్పారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

ఇసుక ర్యాంపులు తనిఖీ


ఇసుక ర్యాంపుల వద్ద తహసీల్దార్ మురళీమోహన్

మాకవరపాలెం, జూలై 16 : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం తహసీల్దార్ మురళీమోహన్ రావు ఇసుక ర్యాంపులను పరిశీలించారు. మాకవరపాలెం, తూటిపాల, తాడపాల, జంగాలపల్లి, మల్లవరం, కొండలఅగ్రహారం తదితర గ్రామాల్లో ఇసుక ర్యాంపులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇసుక నిల్వలను గుర్తించి ప్రభుత్వానికి పూర్తి నివేదికను పంపనున్నట్టు తెలిపారు. తాడపాల జిరాయితీ భూముల్లో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. తహసీల్దార్ వెంట ఎస్ఐ.రామకృష్ణారావు, డీటీ శంకర్‌రావు,ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి, మైనింగ్ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్యం పనులు


కాలువల్లో చెత్తను తీస్తున్న పారిశుధ్య సిబ్బంది

కృష్ణాదేవిపేట, జూలై 16 : మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను తీసేందుకు చర్యలు తీసుకున్నారు. బీసీ కాలనీ రహదారిలో మంగళవారం తీయించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

శిథిలావస్థలో బస్‌షెల్టర్లు.. ప్రయాణికుల ఇబ్బందులు


తాళ్ళచీడికాడ జంక్షన్‌లో శిథిలమైన బస్‌షెల్టర్

కృష్ణాదేవిపేట, జూలై 16 : కృష్ణాదేవిపేట-నర్సీపట్నం మార్గంలో గల పలు బస్‌స్టేషన్లు మరమ్మత్తులకు గురయ్యాయి. వీటిలో తాళ్ళచీడికాడ జంక్షన్‌లో బస్‌స్టేషన్‌పై ఐదేళ్ళ క్రితం చింతచెట్టు పడి శిథిలమైంది. అలాగే గింజర్తి, చోద్యం, గొలుగొండ, ఆరిలోవ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వం 15 ఏళ్ళ క్రితం నిర్మించిన బస్‌స్టేషన్లు మరమ్మకు గురయ్యాయి. దీంతో బస్సు కోసం వేచివుండే ప్రయాణికులు ఎండకు, వాన పడే సమయంలో బస్‌షెల్టర్లలో వేచి ఉంటే ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శిథిలమైన బస్‌షెల్టర్లను తొలగించాలని, అవసరమైన వాటికి మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల వాసులు కోరుతున్నారు.


గింజర్తిలో మరమ్మత్తులకు గురైన బస్‌స్టేషన్

కుక్కల నియంత్రణకు చర్యలేవీ?

▸ ఇంజక్షన్ కోసం రోజు పీహెచ్‌సీకి పదుల సంఖ్య బాధితులు


ఏఎల్‌పురంలో గుంపుగా సంచరిస్తున్న కుక్కలు

కృష్ణాదేవిపేట, జూలై 16 : గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో కుక్కలు స్వైర్యవిహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు గ్రామాల్లో సంచరించాలంటే భయాందోళనలు చెందుతున్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారే లేరని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఏఎల్‌పురం, సీహెచ్ నాగాపురం, చోద్యం, లింగంపేట, పాతకృష్ణాదేవిపేట, కొంగశింగి, విప్పలపాలెం, పల్లావూరు, రేఖపల్లి తదితర గ్రామాల్లో విద్యార్థులను, గ్రామస్థులను కుక్కలు దాడిలో గాయాలపాలైన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ప్రతి రోజు ఎక్కడో ఒకచోట కుక్కలు చిన్నారులు, వృద్ధులు, మహిళలపై దాడి చేస్తున్నాయి. ప్రతిరోజు కృష్ణాదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుక్కకాటు బాధితులు పదుల సంఖ్యలో వస్తున్నారు. ఇప్పటికైనా సంబధిత అధికారులు స్పందించి కుక్కలు నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నకిలీ ధ్రువపత్రాలతో దివ్యాంగ పింఛన్లు

▸ వైసీపీ ప్రభుత్వ హయాంలో పెరిగిన 864 పెన్షన్లు ▸ అర్హులైన వారికి అన్యాయం

మాకవరపాలెం, జూలై 16 : మండలంలో గల ఐదేళ్లలో దివ్యాంగుల పింఛన్‌దారుల సంఖ్య భారీగా ఉంది. ప్రస్తుతం మండలంలో మొత్తం 1464 దివ్యాంగు పింఛనుదారులు ఉన్నారు. అంతకుముందు టీడీపీ హయాంలో ఈ సంఖ్య 600 ఉండేది. అయితే గత ఐదు సంవత్సరాల్లో 864దివ్యాంగ పింఛన్లు పెరిగిపోవడం గమనార్హం. చాలా మంది నకిలీ ధ్రువపత్రాలతో దివ్యాంగ పింఛన్లు పొందుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. మండలంలో ఒక సర్పంచ్ తల్లికి ఎలాంటి అంగవైకల్యం లేకున్నా ఆమె చేయి బాగా లేనట్టు సర్టిఫికెట్ పొంది దివ్యాంగ ఫించను పొందుతున్నట్టు పలువురు చెబుతున్నారు. అలాగే ఓ ఎంపీటీసీ తల్లికి సైతం ఎలాంటి అంగవైకల్యం లేకున్నా కాలు బాగా లేనట్టు సర్టిఫికెట్‌తో దివ్యాంగ పింఛను పొందుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఇద్దరు నాయకుల కుటుంబ సభ్యుల్లోనే సుమారు నలుగురు వ్యక్తులకు దివ్యాంగుల పింఛన్ పొందడం గమనార్హం. వీరిద్దరూ వైసీపీకి చెందిన వారే. ఇలా గత ప్రభుత్వ హయాంలో దివ్యాంగ ఫించను పొందేందుకు నకిలీ సదరం సర్టిఫికెట్లు సమర్పించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బొటనవేలు లేదని చెప్పి సదరం సర్టిఫికెట్ పొంది పించను అందుకుంటున్న వారు కూడా ఉన్నారంటే పరిస్థితి అంచనా వేయవచ్చు. ఇలా అడ్డగోలుగా అనర్హులు పింఛన్లు పొందడం వల్ల అర్హులకు అన్యాయం జరుగుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మండలంలోని పీపీ అగ్రహారంలో 101 దివ్యాంగ పింఛన్లు ఉండగా, లచ్చన్నపాలెంలో 83, మాకవరపాలెంలో 94, జి.కోడూరులో 122, వజ్రగడలో 101, శెట్టిపాలెంలో 107, తూటిపాలలో 80, జి.వెంకటాపురం 106, పైడిపాల 102, రాచపల్లి, రామన్నపాలెం గ్రామాల్లో 150, కొండలఅగ్రహారంలో 125, గిడుతూరులో 93 చొప్పున దివ్యాంగుల పింఛన్లు ఉన్నాయి. అధికంగా రామన్నపాలెం, జి.కోడూరులో ఉన్నాయి.

అనర్హులను ఏరివేయాలి



దివ్యాంగ పింఛన్లు పొందుతున్న అనర్హులను గుర్తించి వాటిని ఏరివేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టాలి.బోగస్ సర్టిఫికెట్ల వల్ల అర్హులకు అన్యాయం జరుగుతుంది. నిజమైన అర్హులను గుర్తించి దివ్యాంగ పింఛను మంజూరు చేయాలి.

- తమరాన సతీష్, అధ్యక్షుడు, దివ్యాంగుల సంక్షేమ సంఘం మండలశాఖ

కల్వర్టుకు మరమ్మతు చేపట్టాలి


పాడైన కల్వర్లు పై భాగం

నాతవరం, జూలై 16 : మండల కేంద్రం నాతవరం రామాలయం వద్ద మెయిన్‌రొడ్డు పక్కనే కల్వర్టుపై ఉన్న సిమ్మెంట్ దిమ్మె పగలిపోయి రంధ్రం ఏర్పడింది. దీంతో ప్రమాదాలు జరగకుండా వెంటనే ఈ కల్వర్టుపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. రాత్రివేళల్లో విద్యుత్ సరాఫరా లేని సమయంలో ఇక్కడ ఏమాత్రం అజాగ్రతగా ఉన్నా మురికి కాలువలో పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ప్రధాన రహదారిలో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకునేటప్పుడు కూడా ఇక్కడ ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉందంటున్నారు. వెంటనే అధికారులు స్పందించి ఇక్కడ కల్వర్టుపై దెబ్బతిన్న సిమ్మెట్ దిమ్మె స్థానంలో కొత్తది అమర్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తుప్పలమయంగా పంట కాలువ


తుప్పలు పెరిగిన కాలువ

మాకవరపాలెం, జూలై 16 : మండలంలోని లచ్చన్నపాలెంలో వరి పొలాలకు సాగునీరు అందించే సాగునీటి కాలువలు అధ్వానంగా ఉన్నాయి. చాలా సాగునీటి కాలువలు తుప్పలతో నిండిపోయాయి. దీంతో అందులో నీరు పారే అవకాశమే ఉండడం లేదు. ఈ కాలువ నుంచి లచ్చన్నపాలెం, కొండల అగ్రహారం గ్రామాలకు సాగునీరు అందుతుంది. కాలువల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బతికుండగానే చంపేశారే!

... 5వ పేజీ తరువాయి

మండిపడ్డారు. అయితే నక్కపల్లి ఆస్పత్రి వైద్యసిబ్బంది ఆరోగ్యశ్రీ ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లారు. బుధవారం మొహరం సెలవు వున్నందున గురువారం ఈ సమస్యను పరిష్కరిస్తామని వారు చెప్పారు. గతంలో ఇంటింటా కుటుంబ సభ్యుల వివరాలను సేకరించేందుకు సర్వే చేసే ప్రక్రియలో ఈ పొరపాటు జరిగిందా?, లేక ఇతర కారణాల వల్ల జరిగిందా ? అనేది తెలియాల్సి వుంది. ఈ విషయమై ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రవికిరణ్‌ను సంప్రతించగా సాధిరెడ్డి లక్ష్మి అనే మహిళ చేతి వేలికి గాయమైనందున చిన్న ఆపరేషన్ చేయాల్సి వుందన్నారు.

జలాశయాలు కళకళ

... 5వ పేజీ తరువాయి

జలాశయం నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరువ అవుతున్నందున జలాశయం అధికారులు అప్రమత్తమయ్యారు. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా మంగళవారం ఉదయం 250 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో నీటిమట్టం 136.50 మీటర్లకు చేరింది. ఇన్‌ఫ్లో వస్తున్నందున జలాశయం మూడో నంబరు గేటు తెరిచి 312 క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెట్టారు. మంగళవారం సాయంత్రానికి నీటిమట్టం 60 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 136.30 మీటర్లకు చేరిందని, జలాశయం పరిస్థితిని బట్టి నీటిమట్టాన్ని క్రమబద్ధీకరిస్తున్నామని ఏఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఇన్‌ఫ్లో పెరిగితే పరిస్థితిని బట్టి నీటిని విడిచిపెడతామని చెప్పారు.

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీ

నాతవరం, జూలై 16 : నాతవరం మండలంలో గత పది రోజుల నుంచి రైతులు వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. ఆశాజనకంగా వర్షాలు పడుతుండడంతో పల్లపు ప్రాంతాల్లో పదును ఆరకపోవడం, మరోవైపు ఖరీఫ్ సీజన్ దగ్గర పడటంతో రైతులు వరినారు వేసుకోవలసి ఉంది. ఈ పరిస్థితుల్లో రైతులు వరినారు వేయడం ఆలస్యం చేస్తే ఇబ్బంది పడాల్సివస్తోందని భావించి పొలాలు పదును ఆరకపోవడంతో దమ్ము ఆకు వేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. అలాగే పంటపొలాల్లో పెరిగిన పిచ్చితుప్పలను రైతులు ఇప్పటి నుంచే తీపి వేస్తూ వచ్చే ఖరీఫ్‌కు ఇబ్బంది లేకుండా జాగ్రత్త పడుతున్నారు. పంటపొలాలకు నీరు వెళ్లే పిల్లకాలువల్లో కూడా తుప్పలను రైతులు తొలగిస్తున్నారు. అలాగే పిల్లకాలువల్లో పూడికను కూడా తీసే పనుల్లో రైతన్నలు బిజీబిజీగా ఉన్నారు.

పాతలక్ష్మీపురంలో క్షీణించిన పారిశుధ్యం


కాలువలో పేరుకుపోయిన చెత్త

నర్సీపట్నం అర్బన్, జూలై 16 : మండలంలోని పాతలక్ష్మీపురంలో పారిశుధ్యం క్షీణించింది. ఎక్కడిడిక్కడే చెత్తాచెదారం కాలువల్లో పేరుకుపోవడంతో మురుగునీరు నిలిచిపోతోంది. కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగించకపోవడంతో ఇళ్ల వద్ద వాడుతున్న నీరు రోడ్లపై పారుతోంది. దీంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెత్త తడిచి కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే దోమల బెడద అధికంగా ఉందని పలువురు అంటున్నారు.

చోడవరం
నియోజకవర్గం

విద్యార్థులకు క్షేత్ర పరిశీలన అవసరం

చోడవరం, జూలై 16: విద్యార్థులకు చదువుతో పాటు క్షేత్ర పరిశీలన అవసరమని వివేకానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పూసర్ల సంతోష్‌కుమార్ చెప్పారు. కళాశాల విద్యార్థులకు కొండెంపూడి కృషివిజ్ఞాన కేంద్రంలో మంగళవారం విజ్ఞాన యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు కిశోర్‌కుమార్, పి.బాపులు వ్యవసాయం శాస్త్ర పరిశోధలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో చీపురుపల్లి దేముడు, అధ్యాపకుడు రామారావు పాల్గొన్నారు.

జీపీఎస్ జీవో గెజిట్ నిలుపుదల హర్షణీయం

బుచ్చెయ్యపేట, జూలై 16: జీపీఎస్ జీవో గెజిట్ నిలుపుదల చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించడంపై ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దర్మారావు, ఎస్.దురాప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ప్రజల్లో భాగమైన ఉద్యోగ, ఉపాధ్యాయులను వైసీపీ ప్రభుత్వం జీపీఎస్ జీవోను గెజిట్ చేసి ఆందోళనకు గురిచేసిందన్నారు. గద్దెనెక్కిన ఏడు వారాల్లో సీఎం చంద్రబాబు జీపీఎస్ జీవో గెజిట్‌ను నిలుపుదల చేసి, ఉద్యోగుల పక్షపాతిగా నిరూపించుకున్నారన్నారు.

టెన్త్ పరీక్ష ఫీజులో దివ్యాంగులకు రాయితీలు

బుచ్చెయ్యపేట, జూలై 16: దివ్యాంగ విద్యార్థులకు పదో తరగతి పరీక్ష ఫీజులో రాయితీలు కల్పిస్తున్నట్టు డిప్యూటీ డీఈవో పి.అప్పారావు అన్నారు. వడ్డాది జడ్పీ హైస్కూల్‌ను మంగళవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి విద్యా కానుక కిట్ల గురించి ఆరా తీశారు. షూస్ పంపిణీ చేయాల్సి ఉందని, బ్యాగ్‌లు కొంత వరకు రాలేదని ఎంఈవో కాశీ విశ్వేశ్వరరావు తెలిపారు. పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే రెగ్యులర్ దివ్యాంగ విద్యార్థులకు ఫీజు మినహాయింపు ఉంటుందన్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకటరావు పాల్గొన్నారు.

అమ్మకు ఇచ్చే గౌరవం మొక్కలకు ఇవ్వండి

రావికమతం, జూలై 16: అమ్మకు ఇచ్చే గౌరవాన్ని మొక్కలు కూడా ఇవ్వాలని జిల్లా సోషల్ ఫారెస్టు రేంజర్ గౌరేష్ పిలుపునిచ్చారు. మంగళవారం గర్నికం విద్యాలయాల్లో మొక్కలు నాటారు. సమాజంలో తల్లి చేసిన మేలులా ప్రకృతిలో చెట్లు కూడా చేస్తాయని, ఈ విషయాన్ని గ్రహించి అందరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు.



పేదల కష్టాలు తెలిసిన ప్రభుత్వం: ఎమ్మెల్యే రాజు


సరకులు అందిస్తున్న చేస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, జూలై 16: కూటమి ప్రభుత్వానికి పేదల కష్టాలు తెలుసని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాయితీ ధరలకు కందిపప్పు, బియ్యం విక్రయించే కౌంటర్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యులకు చౌక ధరలకు నిత్యావసర సరకులు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ పెద బాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి వెంకట అప్పారావు, సభ్యుడు శ్రీను పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి జి.గదబపాలెం సమస్యలు

రావికమతం: గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని గుడ్డిపగదబపాలెం గిరిజనులు ఎమ్మెల్యే రాజుకు తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ స్తంభాలు, తాగునీటి సౌకర్యం సక్రమంగా లేవని, వాటిని మెరుగుపరిచి తమ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. వీటి పరిష్కారానికి కృషి చేస్తానని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మజ్జి అప్పారావు, గల్లా నానిబాబు, గుమ్మాల అప్పలనాయుడు, జి.ఎర్రినాయుడు పాల్గొన్నారు..

బీఎన్ రోడ్డులో ట్రాఫిక్ జామ్


బీఎన్ రోడ్డులో స్తంభించిన వాహనాలు

బుచ్చెయ్యపేట, జూలై 16: భీమునిపట్నం-నర్సీపట్నం (బీఎన్) రహదారిలోని తాచేరు వంతెన వద్ద డైవర్షన్ రోడ్డులో మంగళవారం ట్రాఫిక్ స్తంభించిపోయింది. నర్సీపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు చోడవరం వెళ్తుండగా మరమ్మతుకు గురికావడంతో సుమారు 40 నిమిషాల పాటు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఎస్ఐ డి.ఈశ్వరరావు బస్సును ఎక్స్‌కవేటర్‌తో తీయించడంతో సమస్య తీరింది.

రహదారి నిర్మాణం పూర్తిచేయాలని ఆదివాసీల ధర్నా


రోడ్డు కోసం నినాదాలు చేస్తున్న ఆదివాసీలు

రావికమతం, జూలై 16: చినపాచిల-టి.అర్జాపురం రింగు రోడ్డును తక్షణమే పూర్తి చేయాలని కొట్నాపల్లి ఆదివాసీలు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు మాట్లాడుతూ ఎనిమిది గ్రామాలకు ఉపకరించే ఈ మార్గాన్ని పీఎంజేఎస్‌వై నిధులతో గతంలో బీటీ రోడ్డుగా నిర్మించారన్నారు. భారీ గ్రానైట్ వాహనాల వల్ల ఈ రోడ్డు ధ్వంసమైందన్నారు. దీంతో రాకపోకలకు, 108 వాహనాలు రావడానికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులు, పాలకులు తక్షణమే స్పందించాలని కోరారు.

ఘనంగా పోలమాంబ అనుపమహోత్సవం

బుచ్చెయ్యపేట, జూలై 16: వడ్డాదిలో పోలమాంబ అనుపమహోత్సవం ఘనంగా జరిగింది. ఈ నెల 10న అమ్మవారిని శతకంపట్టు వద్ద ఏర్పాటు చేశారు. ఏడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారిని ఊరేగించి అనుపోత్సవం చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, టీడీపీ నాయకులు ఎస్.శ్రీనివాసరావు, కోరుకొండ గురుమూర్తి, ముత్యాల సూరిబాబు, సూరాతి పేరమ్మ, బొబ్బాది రాజు, కామరాజు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అభినందన

చోడవరం, జూలై 16: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు మంగళవారం అభినందించారు. సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించిన వీరికి కలెక్టర్ జారీ చేసిన ప్రశంసాపత్రాలను హెచ్‌వోడీ రాధాకృష్ణ అందించి సత్కరించారు. అలాగే స్వాతంత్ర్య సమరయోధులు పొట్టి శ్రీరాములు చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్, ఎన్ఎస్ఎస్ పీవోలు మాల్యాద్రి, రత్నభారతి, పిచ్చమ్మ, అధ్యాపకులు రఫియుద్దీన్, సుదీర్, అప్పలనాయుడు, కృష్ణారావు, సరస్వతి, రామలక్ష్మి పాల్గొన్నారు.

85 మందికి నేత్ర పరీక్షలు

రావికమతం, జూలై 16: మేడివాడ గ్రామంలో మంగళవారం 85 మందిక నేత్ర పరీక్షలు చేశారు. శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి వైద్య నిపుణులు సేవలు అందించారు. వీరిలో 43 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించి, ఆస్పత్రికి తరలించినట్టు క్యాంపు కోఆర్డినేటర్ అరుణ్‌కుమార్ తెలిపారు.

రైతులకు అవసరమైనప్పుడల్లా నీరు విడుదల

▸ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

దేవరాపల్లి, జూలై 16: రైతులకు అవసరమైనప్పుడల్లా రైవాడ నీరు విడుదల చేయడానికి సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆదేశించారు. రైవాడ నీటి నిల్వల గురించి డీఈఈ సత్యంనాయుడను మంగళవారం అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం 105.6 మీటర్ల నీటిమట్టం ఉందని, సాగునీటికి ఇబ్బంది ఉండదని డీఈఈ బదులిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నీరు-చెట్టు పనులు చేసి బిల్లులు రానివారు రికార్డులు సిద్ధం చేసుకోవాలన్నారు.


చింతాలమ్మ ఊరేగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు, భక్తులు

ఘనంగా ముషిడిపల్లి చింతాలమ్మ ఊరేగింపు

దేవరాపల్లి, జూలై 16: ముషిడిపల్లి చింతాలమ్మ గ్రామ దేవత ఒడ్డు పండగ మంగళవారం ఘనంగా జరిగింది. మాజీ సర్పంచ్ సోమిరెడ్డి గోవింద ఆధ్వర్యంలో జరిగిన అమ్మవారి ఊరేగింపులో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొని గ్రామ దేవతను దర్శించుకున్నారు. సంప్రదాయంగా వస్తున్న గ్రామ దేవతల పండగలను జరుపుకోవడం వల్ల అందరూ కలయికతో ఆధ్యాత్మిక సంతరించుకుంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీఎమ్మెల్యే గవిరెడ్డిరామానాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, నాయకులు సోమిరెడ్డి గోవింద, పోతల.పాత్రునాయుడు, పెద్దాడ వెంకటరమణ, మహేశ్వరీ నాయుడు, మాజీ సర్పంచ్‌లు సాంబమూర్తి, వెంకటరావు పాల్గొన్నారు.

శతకంపట్టులో కొలువుతీరిన మరిడిమాంబ

మాడుగుల, జూలై 16: గవరవీధిలోని బందిలదొడ్డి శతకంపట్టు వద్ద మరిడిమాంబ ఘటాలు, పాదాలకు ఊరేగింపుగా తీసుకువెళ్లి కొలువు ఉంచారు. ఇక్కడ రెండు రోజులు పూజలందుకున్న అనంతరం అమ్మవారిని తిరిగి గురువారం సాయంత్రం ప్రధాన ఆలయానికి తీసుకు వెళ్తారు. అలాగే అమ్మవారి ఆలయం వద్ద వేకువజాము ఆరు గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు పి.అప్పలరాజు, డి.సూర్యారావు, శ్రీనాద శ్రీనివాసరావు, బి.పైడియ్యనాయుడు, డిల్లీ నానాజీ, జవ్వాది వరహాలు, మోదినాయుడు, అమ్మతల్లినాయుడు, సయ్యపురెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు.

వరి నారుమడులపై రైతులకు అవగాహన

మాడుగుల రూరల్, జూలై 16: మండలంలోని పోతనపూడి అగ్రహారం, వీరనారాయణం, గొటివాడ అగ్రహారం గ్రామాల్లో ఏవో వాసుదేవరావు మంగళవారం వరి నారుమడులపై రైతులకు అవగాహన కల్పించారు. తేలికపాటి వర్షాలు కురుస్తున్నందున అధికంగా నీరు నిల్వ ఉంచకూడదని, నీరు పోయేలా కాలువలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నారుపోసిన 10-15 రోజుల మధ్యలో ప్రతీ ఐదు సెంట్ల నారుమడికి రెండు కిలోల చొప్పున యూరియా, డీఏపీ, పొటాష్ ఎరువు వేయాలన్నారు. సిబ్బంది గౌరినాయుడు, రేణుక, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో డీపీవో సమీక్ష


కేజే పురంలో లేఅవుట్ పరిశీలిస్తున్న డీపీవో

కె.కోటపాడు, జూలై 16: మండలంలోని కేజే పురం పంచాయతీని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఆర్.శిరీషరాణి మంగళవారం సందర్శించారు. ఇక్కడ లేఅవుట్ నిబంధనలకు అనుకూలంగా లేదని మీ కోసంలో అందిన ఫిర్యాదు మేరకు విచారణ నిమిత్తం ఆమె పంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా లేఅవుట్‌పై నిబంధనలు మేరకు పూర్తి సమాచారంతో రెండు రోజుల్లోగా నివేదిక అందించాలని ఆదేశించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో పారిశుధ్య కార్యక్రమాలు, డయేరియా, తాగునీటిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీపీఆర్సీ నాగలక్ష్మి, ఎంపీడీవో పట్నాయక్, విస్తరణాధికారి పీవీవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

మాడుగుల
నియోజకవర్గం

పది గ్రామాల్లో ఆధార్ నమోదు

కె.కోటపాడు, జూలై 16: మండలంలోని పది గ్రామాల్లో ఆధార్ నమోదు కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీవో పట్నాయక్ తెలిపారు. సచివాలయ పరిధిలో పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ చిన్నారులకు పెండింగ్‌లో ఉన్న ఆధార్ నమోదు అప్‌డేట్ చేయడానికి, నూతన ఆధార్ నమోదు, పేర్లు సరిచేయడం తదితర పనులు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ నెల 23వ తేదీన పిండ్రంగి, వి.సంతపాలెం, 24న కొరువాడ, వారాడ, 25న గవరపాలెం, ఆర్వై అగ్రహారం, 26న ఎ.కోడూరు, సూదివలస, 27న సింగన్నదొరపాలెం, మర్రివలస గ్రామాల ప్రజలకు దాలివలస, కెజె పురం సచివాలయాల్లో నమోదు చేస్తామని చెప్పారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాను కలిసిన మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి



చీడికాడ, జూలై 16: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు మంగళవారం గాజువాకలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువతో సన్మానించారు. నియోజకవర్గంలో పార్టీ పనితీరుపై పల్లాకు వివరించారు.

సంపద తయారీ కేంద్రాల పరిశీలన

కె.కోటపాడు, జూలై 16: మండలంలోని వారాడ, కేజే పురం, వి.సంతపాలెం, కొరువాడ గ్రామాల్లోని సంపద తయారీ కేంద్రాలను మండల ప్రత్యేక అధికారిణి నాగలక్ష్మి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు.

వర్షా కాలంలో వేడి నీటినే తాగాలి

చీడికాడ, జూలై 16: వర్షాకాలం పూర్తయ్యేవరకూ అందరూ వేడి ఒడబోసిన నీటినే తాగాలని చీడికాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్‌కుమార్ సూచించారు. ఫ్యామిలీ ఫిజీషన్‌లో భాగంగా కోనాం శివారు గుడివాడ గిరిజన గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. 38 మందికి ఆరోగ్య తనిఖీలు చేయగా నలుగురికి జ్వరాలు ఉన్నట్టు తేలింది. వీరందరికీ అవసరమైన మందులు పంపిణీ చేశారు. శిబిరంలో వైద్య ఇబ్బంది వెంకటరావు, పి.పేరునాయుడు, రాజేశ్వరి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లల మెనూలో అశ్రద్ధ చేయవద్దు

చీడికాడ, జూలై 16: పిల్లలకు పెడుతున్న మెనూలో ఎటువంటి అశ్రద్ధ చేయవద్దని ఎంపీడీవో ఉమామహేశ్వరి అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించారు. మండలంలోని జి.కొత్తపల్లిలో గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగుల హాజరుపై ఆరా తీసి సంతకాల వారీగా అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని ఎంపీడీవో ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఏయే పాటలు, ఆటలు, విద్యాభ్యాసం చేస్తున్నారని కార్యకర్తలను ప్రశ్నించారు. అనంతరం నూతనంగా నిర్మించే అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొల్లి సూరినాయుడు, పంచాయతీ కార్యదర్శి పట్నాలగోపి, వీఆర్‌వో కె.రామసత్యనారాయణ పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

చీడికాడ, జూలై 16: మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్టు పెదగోగాడ పశువైద్యాధికారి కె.రాఘవమ్మ తెలిపారు. మండలంలోని తురువోలు, అర్జునగిరి గ్రామాల్లో మంగళవారం పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ముద్ద చర్మవ్యాధి నివారణకు పశువులకు టీకాలు వేయగా, జి.కొత్తపల్లి గ్రామంలో గొర్రెలు, మేకలకు నీలినాలుక వ్యాధి నివారణకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా రైతులకు రాఘవమ్మ సూచనలు చేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది అర్జునమూర్తి పాల్గొన్నారు.